ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా రిపబ్లిక్ తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888



Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -300 | పేజీలు - 8 వెల - 03/- | శనివారం 14 ఫిబ్రవరి 2026


# గతఐదేళ్ల పాలన ఓ విధ్వంసం


## గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో చంద్రబాబు

**అసెంబ్లీలో ఎందరో కన్నీళ్లు పెట్టుకున్నారు**

**20 నెలల కూటమి పాలనలో అభివృద్ధికి పెద్దపీట**

**రాష్ట్ర పునర్నిర్మాణం కోసమే కూటమి**

**రాజధాని రైతుల త్యాగం మరువలేనిది**



అమరావతి,**ఫిబ్రవరి 13 (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనా కాలంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలోని ఐదేళ్లు జరిగింది మామూలు విధ్వంసం కాదని ఆరోపించారు. తనలాంటి వాళ్లు ఎంతో మంది నాడు కనీళ్లు పెట్టుకున్నారంటే వైసీపీ పాలన ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చున్నారు. శుక్రవారం ఏపీ అసెంబ్లీలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ అనంతరం చంద్రబాబు సాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. చట్టసభ అనేది ప్రజా దేవాలయమన్నారు. ఇటీవల విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించామని తెలిపారు. సభలోని సభ్యులకంటే.. మాక్ అసెంబ్లీలోని విద్యార్థులే చక్కగా ప్రసంగించారని కొనియాడారు. ఒకప్పుడు ఈ అసెంబ్లీ అనుచిత వ్యాఖ్యలకు నమూనాగా ఉండేదన్నారు. అసెంబ్లీలో తనకు జరిగిన అవమానానికి నాడు కన్నీళ్లు పెట్టుకోవాల్సి వచ్చిందన్నారు. 2019-2024 మధ్య తనలా కన్నీళ్లు పెట్టుకున్న మిగతా 2లో...

# 'సేవాతీర్థ్'లోకి పీఎంవో

## ప్రధాని కార్యాలయానికి కొత్త చిరునామా

**'న్యూఢిల్లీ' ఏర్పడిన రోజే నాంది**

**కొత్త భవనాలను ప్రారంభించిన ప్రధాని**



న్యూఢిల్లీ, **ఫిబ్రవరి 13 (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
దేశ రాజధాని చరిత్రలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. దాదాపు 95 ఏళ్లపాటు ఒకే భవనంలో కొనసాగిన ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో) తొలిసారి కొత్త చిరునామా పొందింది. కొత్త భవనం 'సేవాతీర్థ్'లోకి శుక్రవారం లాంఛనంగా మారింది. ఆధునిక రాజధాని నగరంగా న్యూఢిల్లీ ఏర్పడిన రోజే ఈ అపూర్వ ఘటన చోటుచేసుకోవడం విశేషం. పీఎం రాహత్, లఖ్‌పతి దీదీలు, రైతులు, స్టార్టప్‌లకు సంబంధించిన ఫైళ్లపై సంతకం చేయడం ద్వారా ప్రధాని మోదీ శుక్రవారం కొత్త కార్యాలయం నుంచి పాలనను ప్రారంభించారు. ఇప్పటివరకు ఢిల్లీలోని సౌత్ బ్లాక్ నుంచిమిగతా 2లో...

# ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

**మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు రెండో దశ**

**చివరి రోజూ ప్రతిపక్షాల ఆందోళనలు**

**అమెరికాతో ట్రేడ్ డీల్, ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై నిరసనలు**

**పలు అంశాలపై కేంద్రాన్ని నిలదీసిన సభ్యులు**



# 'పట్టణం' హస్తానిదే

**68 మున్సిపాల్టీల్లో కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యం**

**బీఆర్ఎస్ 14కే పరిమితం -33 చోట్ల హంగ్**

**1,530 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు**

**775 స్థానాలతో రెండో స్థానంలో బీఆర్ఎస్**

**4 కార్పొరేషన్లలో కాంగ్రెస్ పాగా**

**నిజామాబాద్, కరీంనగర్‌లో బీజేపీకి మెజార్టీ స్థానాలు**

**16న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక**



హైదరాబాద్**ఫిబ్రవరి 13 (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. మొత్తం 116 మున్సిపాల్టీలు, ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి. వాటిలో 64 మున్సిపాల్టీలు, 4 కార్పొరేషన్లలో కాంగ్రెస్‌పార్టీ సంపూర్ణ మెజారిటీ సాధించింది. 14 మున్సిపాల్టీల్లో బీఆర్ఎస్ గెలిచింది. బీజేపీ ఏ మున్సిపాల్టీలోనూ స్పష్టమైన ఆధిక్యతను కనబర్చలేదు. కరీంనగర్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లలో హంగ్ ఏర్పడింది. ఇక్కడ బీజేపీ అత్యధిక స్థానాల్ని గెలిచింది. కొత్తగూడెం మున్సిపాల్టీని బీఆర్ఎస్ మద్దతుతో సీపీఐ కైవసం చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో 2996 వార్డులో ఎన్నికలు జరగాల్సి ఉండగా, 12 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. ఒక వార్డులో ఎన్నిక వాయిదా పడింది. మిగిలిన 2,983 స్థానాలకు ఎన్నికలు జరిగాయిమిగతా 2లో...



# మహిళల జోలికొస్తే వదిలిపెట్టేది లేదు

**సీఎం తల్లిని అవమానిస్తే..2 చిన్న మాటలా?**

**అంబటి రాంబాబు వ్యాఖ్యలను సమర్థిస్తారా?**

**వైసీపీ సభ్యులపై మంత్రి లోకేశ్ మండిపాటు**

**జగన్ తల్లికైనా, ఏ మహిళకైనా ఒకే న్యాయం**

**మండలిలో మండిపడిన మంత్రి**



# పాలకమండళ్లు పటిష్టంగా ఉంటే అపచారాలు జరగవు

**రాజకీయాలకు అతీతంగా దేవాలయాలను పరిరక్షించాలి**

**గత ప్రభుత్వంలో జరిగిన అపచారాలు పునరావృతం కారాదు**

**శ్రీకాళహస్తి గిరి ప్రదక్షిణను వర్చువల్‌గా ప్రారంభించిన పవన్**

అమరావతి,**ఫిబ్రవరి 13 (ప్రజా రిపబ్లిక్ న్యూస్)** దేవాలయాల పరిరక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. పాలక మండళ్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తే దేవాలయాల్లో అపచారాలు జరగవని, రాజకీయాలకు అతీతంగా దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత పాలక మండళ్లపై ఉందని పవన్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో మిగతా 2లో...

# నల్లమలసాగర్‌పై తెలంగాణ అభ్యంతరం చెప్పడం తగదు

**: సీఎం చంద్రబాబు**




**2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని వెల్లడి**

**ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం**

**ఆరోగ్య సేవల మెరుగుకు సంజీవని.. ఫిబ్రవరి 16న రాష్ట్రానికి బిల్ గేట్స్**

**విశాఖకు గూగుల్, టీసీఎస్.. రామాయపట్నం వద్ద బీపీసీఎల్ భారీ రిఫైనరీ**

# 3.32 లక్షల కోట్లతో నేడే బడ్జెట్



అమరావతి, **ఫిబ్రవరి 13 (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్రప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను శనివారం శాసనసభ, మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ దఫా బడ్జెట్ దాదాపు రూ.3.32 లక్షల కోట్లుగా ఉండే అవకాశముంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26)లో రూ.3,22,359 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా.. ఈసారి దాదాపు రూ.10,000 కోట్లు పెంచనున్నట్లు సమాచారం. అసెంబ్లీలో ఉదయం 11:15 నిమిషాలకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. దానికి ముందు పదిన్నర గంటలకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతుంది. పయ్యావుల బడ్జెట్ పెట్టిన తర్వాత వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు వ్యవసాయ బడ్జెట్‌ను సభ ముందుంచుతారు. మిగతా 2లో...

# 3.32 లక్షల కోట్లతో నేడే బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

హోం మంత్రి అనిత శాసనమండలిలో రాష్ట్ర బడ్జెట్‌ను, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అనంతరం ఉభయసభలూ వాయిదాపడతాయి. 17, 18 తేదీల్లో బడ్జెట్‌పై చర్చించి ఆమోదం తెలుపుతాయి. కాగా.. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాలకు రెవెన్యూ లోటు నిధులను పూర్తిగా నిలిపివేశారు. దీంతో మన రాష్ట్రానికి ఏడాదికి రూ.10,000 కోట్లు తగ్గిపోయినట్లే. ఇతర గ్రాంట్లను కూడా కేంద్రం నిలిపివేశారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రం వాటా పెరుగుతుందని భావించినా అతి స్వల్పంగా పెరిగింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా కొంత అప్రమత్తమైంది. సాధారణంగా ప్రతి ఏటా బడ్జెట్‌ను 10 శాతం పెంచుతూ వస్తున్నారు. ఈసారి మాత్రం కేవలం రూ.10,000 కోట్లే పెంచినట్లు తెలిసింది. అభివృద్ధి, సంక్షేమం, మహిళలు, రైతులకు ప్రాధాన్యమిస్తూ.. ముఖ్యంగా సూపర్ సిక్స్ హామీల అమలుకు నిధులు కేటాయించే అవకాశాలున్నాయి. పారిశ్రామిక రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తారని అంటున్నారు. రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణంపై కూడా దృష్టి సారిస్తున్నారు.

# పాలకమండళ్లు పటిష్టంగా ఉంటే అపచారాలు జరగవు

(మొదటి పేజీ తరువాయి)

తిరుమలలోనే ఎన్నో అపచారాలు జరిగాయన్నారు. నాటి పాలక మండలి బాధ్యతగా వ్యవహరిస్తే తప్పులు జరిగేవి కాదని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఆలయ పాలక మండళ్లు గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు, అపచారాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నూతనంగా నిర్మించిన శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ రోడ్డును వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి పవన్ కల్యాణ్ వర్చువల్ గా ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఆలయాలు నాగరికతకు చిహ్నాలు అన్నారు. మన కళలు, మన వారసత్వం, మన సంస్కృతి, ధర్మ పరిరక్షణ ఆలయాలతో ముడిపడి ఉన్నాయి. అరుణాచలంలో గిరిప్రదక్షణ చేస్తారు అని తెలుసు.. నాకు గిరిప్రదక్షణ చేయాలని చాలా కోరిక ఉంది. దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆహ్వానం మేరకు, భక్తుల కోరిక మేరకు త్వరలో శ్రీకాళహస్తి క్షేత్రాన్ని సందర్శించి కచ్చితంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటానన్నారు.. శివరాత్రికి రెండు రోజుల ముందు ఈ శ్రీకాళహస్తి గిరి ప్రదక్షణ మార్గాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు పవన్.. గత ప్రభుత్వం ఆలయాల పరిరక్షణ అంశాన్ని చాలా నిర్లక్ష్యం చేసిందన్నారు.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దేవాదాయ మంత్రిగా రామనారాయణ రెడ్డి బాధ్యతలు స్వీకరించాక ఆలయాల పరిరక్షణను ఎంతో బాధ్యతగా ముందుకు తీసుకువెళ్తున్నాం అన్నారు. నిరాదరణకు గురైన ఎన్నో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నారని.. భక్తులు కోరుకుంటే ఏజెన్సీలో కూడా ఆలయాలు నిర్మించాలన్న ఆయన గొప్ప సంకల్పానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా అన్నారు పవన్ కల్యాణ్..శివరాత్రి తర్వాత గిరిప్రదక్షణ మార్గంలో మొక్కలు నాటుతామని.. శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ మార్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రూ. 10 కోట్లు వెచ్చించి సిమెంటు రోడ్డు నిర్మించామన్నారు. 22 కిలోమీటర్ల గిరి ప్రదక్షణ మార్గాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం అన్నారు.. అటవీ శాఖ ఆధ్వర్యంలో గిరిప్రదక్షణ మార్గానికి ఇరు వైపులా మొక్కలు నాటే కార్యక్రమానికి శివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం శ్రీకారం చుట్టబోతున్నాం అన్నారు.. శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ ద్వారా ప్రతి భక్తుడికి కైలాసగిరి ప్రదక్షణ చేసిన పుణ్యఫలం దక్కాలని ఈ సందర్భంగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాన్నారు.సంక్షేమ ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాదని ఆధ్యాత్మిక ఆంధప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని.. ఇందుకోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని ఏపీ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. 15,016 ఆలయాలకు పాలకమండళ్లను వేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే సుమారు వెయ్యి ఆలయాలకు పాలమండళ్లను నియమించామని చెప్పుకొచ్చారు. మిగిలిన వాటిపైనా దృష్టి సారిస్తామని మంత్రి చెప్పుకొచ్చారు.

# 'సేవాతీర్థ్'లోకి పీఎంవో

(మొదటి పేజీ తరువాయి)

పీఎంవో విధులు నిర్వహించింది. 95 ఏళ్ల క్రితం, 1931 ఫిబ్రవరి 13వ తేదీన న్యూఢిల్లీ నగరం అధికారికంగా అందుబాటులోకి వచ్చింది. పాలనా అవసరాల కోసం అప్పుడు నిర్మించిన సౌత్ బ్లాక్, నార్త్ బ్లాక్‌ల్లోనే పీఎంవో, ముఖ్యమైన మంత్రిత్వ శాఖలు పనిచేయడం మొదలుపెట్టాయి. 1947లో దేశ స్వాతంత్ర్యం సిద్ధించింది. ఆ తర్వాత మూడేళ్లకు, 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. అరుదైన ఈ ఘట్టాలకు మౌన చారిత్రక సాక్షిగా నిలిచిన రైసినా హిల్స్ కాంప్లెక్స్ పక్కనే 'సేవాతీర్థ్'ను నెలకొల్పారు. పీఎంవో, జాతీయ భద్రతా మండలి సచివాలయం, క్యాబినెట్ సచివాలయం ఇప్పటివరకు వేర్వేరుగా కొనసాగాయి. వాటిని ఇప్పుడు ఒకే గొడుగు కిందకు తెచ్చారు. సెంట్రల్ విస్టా పథకంలో భాగంగా ఈ మూడు విభాగాలూ ఇకపై ఒకే భవన సముదాయంలో పని చేయనున్నాయి. కొత్త భవన ప్రారంభోత్సవానికి గుర్తుగా రూ.వంద నాణేన్ని ప్రధాని ఆవిష్కరించారు. "'ఇండియా ఫస్ట్' లక్ష్యంగా మరింత గౌరవ, వినమ్రతలతో దేశ ప్రజలకు కొత్త కార్యాలయం నుంచి సేవలు అందిస్తాం. కర్తవ్య నిర్వహణ, సేనా తత్పరత, సంకల్పాలకు ఉజ్వల ప్రతీకగా 'సేవాతీర్థ్'గా ఉంటుంది" అన్నారు.

పలు కీలక మంత్రిత్వ శాఖల కోసం కొత్తగా నిర్మించిన కర్తవ్య భవన్-1,2 కార్యాలయాలను ప్రధాని మోదీ ప్రారంభించారు. రైసినా హిల్స్ కాంప్లెక్స్‌కు సమీపంలోనే వీటినీ ఏర్పాటుచేశారు. న్యాయ, రక్షణ, ఆర్థిక, ఆరోగ్య, వ్యవసాయం తదితర శాఖలు ఇకపై ఇక్కడినుంచి పని చేయనున్నాయి. కీలక మంత్రిత్వ శాఖలు ఇప్పటివరకు సౌత్, నార్త్ బ్లాకుల్లో విధులు నిర్వహించాయి. నార్త్ బ్లాక్‌లో హోంశాఖ, ఆర్థిక శాఖ కార్యాలయాలు ఉంటే; సౌత్ బ్లాక్‌లో పీఎంవోతో పాటు రక్షణ శాఖ కార్యాలయాలు ఉండేవి. కాగా, 'సేవాతీర్థ్'లో పాలనను ముఖ్యమైన ఫైళ్లపై సంతకం చేయడం ద్వారా ప్రధాని లాంఛనంగా ప్రారంభించారు. నారీ శక్తిలో భాగంగా.. లఖ్‌పతి దీదీల సంఖ్యను రెట్టింపు చేస్తూ, ఆరు కోట్ల మందిని లక్షాధికారులను చేసే ఫైల్‌పై ప్రధాని సంతకం చేశారు. అలాగే, వ్యవసాయ మౌలిక వసతుల నిధి పరిధిని రూ.లక్ష కోట్ల నుంచి రూ.2లక్షల కోట్లకు విస్తరించారు. కాగా, పీఎంవో సహా కీలక శాఖల కార్యాలయాల తరలింపుతో ఖాళీ అయిన సౌత్, నార్త్ బ్లాక్ భవనాలను జాతీయ మ్యూజియం కోసం కేటాయించనున్నారు. **'పీఎం రాహత్'పై ప్రధాని తొలి సంతకం**

ప్రధాని తన నూతన కార్యాలయంలో 'పీఎం రాహత్' పథకాన్ని ఆమోదిస్తూ తొలి సంతకం చేశారు. రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకూ నగదు రహిత చికిత్స ఈ పథకంతో అందుబాటులోకి రానుంది.ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో ఉచిత వైద్యం అందించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఈ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. ప్రమాదం జరిగిన నాటి నుంచి 7రోజుల్లోగా ఈ సేవలను పొందవచ్చు.

## మహిళల జోలికొస్తే వదిలిపెట్టేది లేదు

**అమరావతి, ఫిబ్రవరి 13 (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

'ఏవో రెండు చిన్న మాటలు అన్నారని' అంటూ అంబటి రాంబాబును వైఎస్ జగన్ వెనుకేసుకు రావడంపై మంత్రి లోకేశ్ మండిపడ్డారు. అవి చిన్న మాటలా అని నిలదీశారు. ముఖ్యమంత్రి తల్లిని అంబటి అవమానించారని, ఈ విషయంలో ఆయనను వదిలిపెట్టేది లేదన్నారు. శుక్రవారం శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి అంబటి రాంబాబును అక్రమంగా అరెస్ట్ చేశారని, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, వైసీపీ సభ్యుడు బొమ్మి ఇజ్రాయిల్ ఆరోపించారు. అంబటి రాంబాబు తన వ్యాఖ్యల్లో తప్పులు గుర్తించి క్షమాపణ చెప్పినా.. అరెస్ట్ చేసి, జైల్లో పెట్టారని బొత్స వ్యాఖ్యానించారు. దీనిపై మంత్రి లోకేశ్ తీవ్రంగా స్పందించారు. "అంబటి రాంబాబు ముఖ్యమంత్రి తల్లిని అవమానించారు. అవునా.. కాదా..? వైసీపీ నేతలు సమాధానం చెప్పాలి. మహిళలను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అలాంటిది అంబటి తప్పుడు మాటలు మాట్లాడితే వదిలిపెడతామా..? టీడీపీ కార్యకర్త వైఎస్ భారతీరెడ్డి గురించి మాట్లాడితే తక్షణమే చర్యలు తీసుకున్నాం. అదీ మా చిత్తశుద్ధి. ఐదేళ్లు మీరేం చేశారు..? మా పార్టీ ఆఫీసుపై దాడిచేస్తే ఏం చర్యలు తీసుకున్నారు..? అసెంబ్లీలో మా తల్లిని అవమానిస్తే.. మీరేం చేశారు..? అంబటి అన్నది రెండు చిన్న మాటలని జగన్ అంటున్నారు. ఒక తల్లిని అవమానిస్తే చిన్న మాటగా చూస్తామా..? మాజీ మంత్రి అయి ఉండి అలాంటి మాటలు మాట్లాడితే సమర్థిస్తారా..? సొంత తల్లిని, చెల్లిని గౌరవించే అలవాటు మీకు లేకపోవచ్చు. కానీ మాకు ఉంది. మహిళల జోలికొస్తే వదిలిపెట్టం. జగన్ తల్లి విషయంలోనైనా... ఇంకెవరి తల్లి, చెల్లి, అక్క, కూతురు గురించైనా తప్పుగా మాట్లాడితే ప్రజా ప్రభుత్వం వదిలిపెట్టే ప్రసక్తే లేదని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారు. నెల్లూరులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే టీడీపీ మహిళా ఎమ్మెల్యే గురించి ఏం మాట్లాడారో చూశాం. దానికి సమాధానం లేదు. అంబటి విషయంలో మాత్రం జగన్ వెళ్లి ప్రెస్‌మీట్‌లో సింపుల్‌గా రెండు చిన్న మాటలన్నాడని చెబుతారు. అవి చిన్నమాటలెలా అవుతాయి? నాయకత్వం వహించే వ్యక్తి అలా అనొచ్చా..? టీడీపీ నేతలెవరైనా తప్పుగా మాట్లాడితే ఆధారాలు ఇవ్వండి.. చర్యలు తీసుకుంటాం.

# నల్లమలసాగర్‌పై తెలంగాణ అభ్యంతరం చెప్పడం తగదు

## : సీఎం చంద్రబాబు

**2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని వెల్లడి**

**ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం**

**ఆరోగ్య సేవల మెరుగుకు సంజీవని.. ఫిబ్రవరి 16న రాష్ట్రానికి బిల్ గేట్స్**

**విశాఖకు గూగుల్, టీసీఎస్.. రామాయపట్నం వద్ద బీపీసీఎల్ భారీ రిఫైనరీ**



**ఫిబ్రవరి 13 (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయడం సమర్థనీయం కాదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఏటా 3,500 టీఎంసీల గోదావరి వరద నీరు సముద్రంలోకి వృథాగా పోతోందని, అందులోంచి 200 టీఎంసీల నీటిని నల్లమలసాగర్‌కు తరలించాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. తెలుగు రాష్ట్రాలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఈ ప్రాజెక్టుకు అడ్డుపడటం సరైన పద్ధతి కాదని హితవు పలికారు.

2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. మూడేళ్లలో ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాజెక్టులను పూర్తిచేస్తామని, పోలవరాన్ని వంశధారతో అనుసంధానిస్తామని హామీ ఇచ్చారు. గడిచిన 20 నెలల్లో తమ సంకీర్ణ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంలో గణనీయమైన ప్రగతి సాధించిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుందని వివరించారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల ఎదురైన ఇబ్బందులను అధిగమించిన తీరును, అభివృద్ధిని అడ్డుకోవడానికి జరుగుతున్న కుట్రలను సభలో ప్రస్తావించారు.

రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కలిసికట్టుగా పనిచేస్తున్నాయని సీఎం తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో జరిగిన విధ్వంసంపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామన్నారు. పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ముందుందని, గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలు విశాఖకు వస్తున్నాయని చెప్పారు. అనకాపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, రామాయపట్నం వద్ద రూ.70,000 కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని కచ్చితంగా నెరవేరుస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

ప్రజారోగ్య సేవలను మెరుగుపరిచేందుకు 'సంజీవని' ప్రాజెక్టును తీసుకొస్తున్నామని, ఇందులో భాగంగా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తామని తెలిపారు. ఈ నెల 16న బిల్ గేట్స్ రాష్ట్ర పర్యటనకు రానున్నారని ముఖ్యమంత్రి వెల్లడించారు.

# గతఐదేళ్ల పాలన ఓ విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

వారెందరో ఉన్నారని ప్రస్తావించారాయన. కూటమి ప్రభుత్వ హయాంలో 20 నెలల్లో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని చంద్రబాబు పేర్కొన్నారు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు.. 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. భూములిచ్చిన రైతులకు మనం ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. అభివృద్ధి చేసి ఎ÷-లాట్లు ఇస్తామని చెప్పామని తెలిపారు. నోటీసులివ్వకుండా నన్ను అరెస్ట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ విశాఖ పర్యటనకు వెళ్తే అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. నాడు మమ్మల్ని అడ్డుకున్న వాళ్లు.. నేడు నీతులు చెబుతున్నారని విమర్శించారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కలిశాయని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదనే పొత్తు పెట్టుకున్నామని స్పష్టం చేశారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తుంటారని.. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటామన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో తమను గెలిపించారని తెలిపారు. పెన్షన్ల కోసం ఏటా రూ.34 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. దేశంలో ఇంత పెద్ద మొత్తంలో పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం ఏదీ లేదని చెప్పుకొచ్చారు. ఈ ఏడాదిలో 1,000 ఏసీ బస్సులను తీసుకొస్తున్నామన్నారు. 20 నెలల్లో ఇంత చేయగలిగామా.! అని ఆశ్చర్యపోయేలా అందరూ సహకరించారని తెలిపారు. విభజన జరిగడం వల్ల రాష్ట్రానికి కొంత మేర నష్టం వాటిల్లిందని ప్రస్తావించారు. నాడు ఏ వైపూ తాను సపోర్టు చేయకుండా తటస్థంగా ఉన్నానని వివరించారు. 2014-2019 మధ్య ఏడాదిలోనే అసెంబ్లీ కట్టామని.. ఇక్కడ అసెంబ్లీ రావడానికి కారణం 29వేల మంది రైతులు 33 వేల ఎకారాల భూమిని ఇచ్చారని తెలిపారు. వారికి పైసా కూడా ఇవ్వలేకపోయామన్నారు. అయితే అదే టెంపో కంటిన్యూ అయి ఉంటే రికవర్ అయ్యేవాళ్లమని చెప్పుకొచ్చారు. నాడు ముగ్గురు కలిసి పోటీ చేశామని.. కేంద్రం కూడా భాధ్యత తీసుకోవాల్సి వచ్చిందని సీఎం పేర్కొన్నారు. 'రాష్ట్రంలో వైసీపీ హయాంలోని విధ్వంసంపై 7 శ్వేతపత్రాలు ఇచ్చాం. సంక్షేమంలో ఎవ్వరూ ఊహించని విధంగా ప్రపంచంలోనే అతిపెద్ద డీబీటీ ప్రోగ్రాం చేస్తున్నాం. రూ.2700 కోట్లు నెలకు ఈ పథకం కింద ఇస్తున్నాం. బకాయిలు కూడా ఇచ్చాం. పిల్లలందరికి తల్లికి వందనం పథకం కింద రూ.10,700 కోట్లు ఇచ్చాం. స్త్రీశక్తి ద్వారా సుమారు 443 కోట్ల మంది ప్రయాణం చేశారు. ఈ విషయంలో ఆర్టీసీని అభినందిస్తున్నా. ఈ ప్రోగ్రాం సక్సెస్ మాత్రమే కాదు.. ప్రభుత్వానికీ మంచి పేరు తెచ్చింది. త్వరలో మరో వెయ్యి ఏసీ బస్సులు తెస్తాం. మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేల నగదును రైతుల అకౌంట్లలో వేస్తాం. అన్ని నియోజకవర్గాల్లో అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నాం' అని చంద్రబాబు పేర్కొన్నారు. ఇకపోతే ప్రతిపక్ష పార్టీ నేత రోడ్డుపైకి వస్తున్నాడంటే ఏం జరుగుతుందోననే భయం ప్రజల్లో నెలకుంటోందన్నారు. ఎక్కడికి వెళ్లినా దౌర్జన్యం, రోడ్డంతా బ్లాక్ చేయడం వంటివి చేస్తున్నారు. గుంటూరు నుంచి విజయవాడ వెళ్లాలంటే ఆరు గంటలా?ఆ సమయంలో ప్రజలు నరకం అనుభవించాలా?జాతీయ రహదారులపై సమావేశాలు పెట్టకూడదని స్పష్టమైన ఆదేశాలున్నా పట్టించు కోవడం లేదు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం సున్నితమైన సమస్య. దీనిపై ఎక్కువ మాట్లాడకూడదనుకున్నా. కొంతమంది కావాలనే భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. వేంకటేశ్వర స్వామి విషయంలో తెలిసి కానీ.. తెలియక కానీ తప్పు చేయను. నిద్ర రానప్పుడు ఆయన్ను తలచుకుంటే వచ్చేస్తుంది. రాష్ట్రంలోని అన్ని ఆలయాలను ప్రక్షాళన చేశాం. తిరుమల లడ్డూ కల్తీకి.. హెరిటేజ్‌కు ఏం సంబంధం?ప్రభుత్వం నుంచి ఆ సంస్థ ఒక్క పైసా కూడా అడగలేదు. పత్రిక ఉంది కదా అని పెద్ద హెడ్‌లైన్లు పెడుతున్నారు. వాళ్ల ఉద్దేశం బ్రాండ్ దెబ్బతీయడమే. బ్రాండ్ డ్యామేజ్ చేస్తే హెరిటేజ్‌కు నష్టం వస్తుందనేది వాళ్ల భావన అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 'పట్టణం' హస్తానిదే

(మొదటి పేజీ తరువాయి)

. వాటిలో తుది వార్తలు అందే సమయానికి కాంగ్రెస్ పార్టీ 1,533 వార్డుల్లో గెలుపొందింది.బీఆర్ఎస్ 775, బీజేపీ 330, ఇతరులు 173, ఎంఐఎం 70 వార్డుల్లో విజయం సాధించాయి. సీపీఐ 35, సీపీఐ(ఎం) 13 వార్డులు గెలిచాయి. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలు పార్టీ రహితంగా జరిగినప్పటికి ఆ పార్టీ బలపర్చిన వారే మూడింట రెండొంతుల మంది జయ కేతనం ఎగుర వేశారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ సర్పంచ్ ఫలితాలే పునరావృతం అయ్యాయి. రామగుండం కార్పొరేషన్‌లో మొత్తం 60 వార్డుల్లో 30, మంచిర్యాలలో 60 డివిజన్లలో 46, నల్లగొండలో 48 వార్డుల్లో 27 స్థానాల్ని కాంగ్రెస్‌పార్టీ కైవసం చేసుకుంది. మహబూబ్ నగర్‌లో మొత్తం 60 స్థానాల్లో కడపటి వార్తలందే సరికి 43 స్థానాలకు ఫలితాలు వెల్లడయ్యాయి. అందులో కాంగ్రెస్‌కు 24స్థానాలు దక్కాయి. నిజామాబాద్, కరీం నగర్‌లలో బీజేపీ మెజార్టీ స్థానాలను దక్కించుకున్నా మేజిక్ ఫిగర్‌ను అందుకోలేకపోవడం తో ఇక్కడ మేయర్ ఎన్నిక రసవత్తరంగా మారనుంది.ఇండిపెండెంట్లు, ఇతర పార్టీల అభ్యర్థుల మద్దతు కోసం ఆ పార్టీ పావులు కదుపుతోంది. కొత్తగూడెంలో ఒంటరిగా పోటీ చేసిన సీపీఐ మెజార్టీ స్థానాలను దక్కించుకుంది. మొత్తం 60 స్థానాల్లో కాంగ్రెస్, సీపీఐ చెరో 22 డివిజన్లలో విజయం సాధించారు. ఇక్కడ బీఆర్ఎస్ 8 స్థానాలను గెలిచి, సీపీఐకి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది. దీనితో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ సీపీఐ వశం అయ్యింది. కాంగ్రెస్‌పార్టీ నేరేడుచర్ల, హుజూర్‌నగర్, హాలియా, కోదాడ, నందికొండ, చండూరు, చిట్యాల, భూత్పూర్, ధర్మపురి, భీంగల్, బిచ్కుంద, బాన్సువాడ, ఎల్లారెడ్డి, చొప్పదండి, సుల్తానాబాద్, చెన్నూరు, మంథని, హుస్నాబాద్, మరిపెడ, డోర్నకల్, నారాయణఖేడ్, సంగారెడ్డి, ఆందోల్-జోగిపేట, సదాశివపేట, రామాయంపేట, హుజూరాబాద్, కొల్లాపూర్, కల్వకుర్తి, మద్దూరు, పెబ్బేరు, స్టేషన్‌ఘన్‌పూర్, మధిర, అశ్వారావుపేట, ఇల్లెందు, ములుగు, యాదిగిరిగుట్ట, ఆలేరు మున్సిపాల్టీల్లో స్పష్టమైన మెజారిటీ సాధించింది.గడ్డపోతారం, ఇంద్రేశం, అయిజ, తొర్రూర్, ఇబ్రహీంపట్నం, తిరుమలగిరి, ఆమన్‌గల్, సిరిసిల్ల సహా మొత్తం 14 మున్సిపాల్టీలను బీఆర్ఎస్ వశం చేసుకుంది. జోగులాంబ గద్వాల జిల్లాలోని వడ్డేపల్లి మున్సిపాల్టీలో ఫార్వర్డ్ బ్లాక్ మెజార్టీ స్థానాలను దక్కించుకుంది. దేవరకద్ర, అలంపూర్, దేవరకొండ, ఆలియాబాద్, కోహీర్, కేసముద్రం, ఆసిఫాబాద్, అమరచింత, గద్వాల, క్యాతనపల్లి, జనగామ, జిన్నారం, నర్సాపూర్, జమ్మికుంట, వేములవాడ, రాయికల్, జహీరాబాద్, బెల్లంపల్లిల్లో ఏపార్టీకి స్పష్టమైన మెజార్టీ రాలేదు. ఇండిపెండెంట్లు ఇతర పార్టీల అభ్యర్థుల మద్దతుపై ఇక్కడ ఎవరికి అధికారం దక్కనుందో ఈ నెల 13న తేలనుంది.

**క్యాంపులు నడిపితే చర్యలు : ఎస్ఈసీ**

క్యాంప్ రాజకీయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్లను ఎన్నికల సంఘం ఆదేశించింది. నిఘా, తనిఖీ బృందాలను మరింత అప్రమత్తం చేయాలని సూచించింది. ఈనెల 16న ఛైర్‌పర్సన్లు, మేయర్ల ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని ఎస్ఈసీ స్పష్టం చేసింది. ఎన్నిక ధ్రువపత్రం స్వయంగా విజేతలకే అందచేయాలని తెలిపింది. ఎన్నికల కోడ్‌కు కట్టుబడి ఉంటామని విజేతలు డిక్లరేషన్ ఇవ్వాలని ఆదేశించింది. బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ అమల్లో ఉంటుందనీ, ముగ్గురికి మించి గుంపుగా ఉండరాదని పేర్కొంది.

# ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 13 (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాలను, భద్రతను తాకట్టు పెట్టిందని ప్రతిపక్షాలు నిరసనలు వ్యక్తం చేసిన తొలి దశ బడ్జెట్ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం, కేంద్ర బడ్జెట్‌పై చర్చ ఉభయ సభల్లో జరిగింది. ఈ రెండు అంశాలపై చర్చల సందర్భంగా ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు నిలదీశాయి. లోక్‌సభలో ఇండస్ట్రియల్ రిలేషన్ కోడ్ బిల్లు ఆమోదం పొందింది.

మార్చి 9న ప్రారంభ కానున్న రెండో దశ బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి. శుక్రవారంనాడు ప్రతిపక్షాలు పార్లమెంటు లోపల, వెలుపల ఆందోళన చేపట్టాయి. ఇండియా-అమెరికా వాణిజ్య ఒప్పందంలోని రహస్యాలను తొలగించడం, ఆర్మీ మాజీ చీఫ్ ఎంఎం నరవాణే పుస్తకంలోని వివాదాస్పద భాగాలను చర్చించడం, తీవ్ర సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ ఫైళ్లలో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల పేర్లు ప్రస్తావనకు రావడం వంటి అంశాలను ప్రతిపక్షాలు లేవనెత్తాయి.రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా తన ప్రసంగంలో ఎక్కువ భాగాన్ని రికార్డు నుంచి తొలగించాలనే చర్యను రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే వ్యతిరేకించారు. రాజ్యసభ చైర్మెన్ సి.పి రాధాకృష్ణన్ ఈ చర్యను ఉపసంహరించుకోవాలన్న ఖర్గే డిమాండ్‌ను తిరస్కరించారు.

**ప్రతిపక్షాల తీవ్ర ఆందోళనలు**

శుక్రవారం లోక్‌సభ సమావేశమైనప్పుడు, ప్రతిపక్ష సభ్యులు తీవ్ర ఆందోళనలు చేపట్టారు. సభ్యులు హోరెత్తిన నినాదాలతో వెల్‌లోకి దూసుకెళ్లారు. స్పీకర్ ఓంబిర్లాకు బదులుగా సభను నిర్వహించిన సంధ్యారే, ప్రతిపక్షాలను శాంతించాలని పదేపదే కోరారు. కానీ ఫలితం లేకపోయింది. దీని తరువాత, సభ కార్యకలాపాలను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైనప్పుడు, కేంద్రమంత్రులు తమ విభాగాలకు సంబంధించిన పత్రాలను సమర్పించారు. అనంతరం సభను వాయిదా వేస్తున్నట్టు సంధ్యారే ప్రకటించారు. జీరో అవర్, ప్రశ్నోత్తరాల సమయం తర్వాత, రాజ్యసభ కూడా మార్చి 9 వరకు వాయిదా పడింది.

**'రాహుల్ సభ్యత్వ రద్దు తీర్మానంపై ఆ తరువాతే నిర్ణయం'**

రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ సభ్యుడు దాఖలు చేసిన నోటీసుపై స్పీకర్‌ను సంప్రదించిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. మొదట్లో హక్కుల ఉల్లంఘన కింద రాహుల్‌పై నోటీసు జారీ చేయాలని అనుకున్నారు. ఈ సందర్భంగానే బీజేపీ సభ్యుడు నిషికాంత్ దూబే రాహుల్‌పై ఒక ముఖ్యమైన తీర్మాన నోటీసు ఇచ్చారు. స్పీకర్‌తో సంప్రదించి ఈ విషయాన్ని హౌస్ ప్రివిలేజెస్ కమిటీకి లేదా ఎథిక్స్ కమిటీకి సూచించాలా లేదా నేరుగా లోక్‌సభకు తీసుకురావాలా వద్దా అని నిర్ణయం తీసుకుంటానని కిరణ్ రిజిజు మీడియాకు తెలిపారు.

**'కేంద్రమంత్రి హర్దీప్ సింగ్‌ను తొలగించాలి'**

బడ్జెట్ సమావేశాల మొదటి, రెండో దశల మధ్య మూడు వారాల విరామం ఉంది. ఈ విరామ సమయంలో, పార్లమెంటరీ కమిటీలు వివిధ విభాగాలకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులను పరిశీలిస్తాయి. ఇండియా-అమెరికా 'ట్రాప్ డీల్'ను రద్దు చేయాలని, ప్రసిద్ధ బాలల వేధింపుల నేరస్థుడు ఎప్‌స్టీన్‌తో సంబంధాలు ఉన్నాయని బహిరంగంగా అంగీకరించిన కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు పార్లమెంటు వెలుపల నిరసన తెలిపాయి.

# జిల్లా అందత్వా నివారణ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు ఉచితముగా అద్దాలు పంపిణీ చేసిన కంటి వైద్య నిపుణులు పి.షేక్షావలి

**పాములపాడు ఫిబ్రవరి 13 రిపబ్లిక్ న్యూస్:-** రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వము విద్యతోపాటు ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత కల్పిస్తుందని ఆత్మకూరు కంటి వైద్యులు పి.షేక్షావలి అన్నారు. శుక్రవారము పాములపాడు మండలంలోని, భానుముక్కల గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్, ఎంపీపీఎస్ పాఠశాలలలో, కొత్త బానకచర్ల జడ్పీహైస్కూల్లో, వేంపెంట జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈరోజు జిల్లా అంధత్వ నివారణ సంఘము ద్వారా వివిధ పాఠశాలలోని, వేంపెంటలో 16 మంది విద్యార్థులకు, భానుముక్కుల-10 మంది విద్యార్థులకు, కొత్త బానకచర్ల పాఠశాల-4గురు విద్యార్థులకు అంతకు ముందు కంటి పరీక్షలు నిర్వహించినవారికి శుక్రవారము ఉచిత అద్దాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు.



ఈసందర్భంగా విద్యార్థిని, విద్యార్థులను ఉద్దేశించి కంటి వైద్య నిపుణులు పి.షేక్షావలి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులు స్మార్ట్ ఫోనుకు బానిసలు అయ్యి కంటి చూపు పోగొట్టుకోవడానికి, మెంటల్లీ మానసిక ఒత్తిడికి గురై లేనిపోని అనారోగ్యాలకు కారణం అవుతున్నారన్నారు. కాబట్టి స్మార్ట్ ఫోన్ కు దూరంగా ఉండాలని, నిరంతరంగా వాడకూడదని, వాటికి దూరంగా ఉండాలని అన్నారు. అలాగే విద్యార్థిని, విద్యార్థులు రోజువారి ఆహారంలో పోషక విలువలు మెండుగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని, మరియు పాలు, గుడ్డు, కూరగాయలు, ఆకుకూరలు రోజు తీసుకోవాలని సూచించారు కళ్ళను జాగ్రత్తగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో వేంపెంట హెచ్ఎం-మొహమ్మద్ రఫీ భానుముక్కుల హెచ్ఎంలు మనోహర్, శ్రీనివాసులు, కొత్త బానకచర్ల హెచ్ఎం-మక్బూల్ భాష, ఆయా పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలపై అధికమవుతున్న వేధింపులు..

## శ్రీకాళహస్తి సిడిపిఓపై చర్యలకు పట్టు..
## జిల్లా కలెక్టర్ కు సీఐటీయూ నేతలు వినతి పత్ర మందించి విజ్ఞప్తి..

**తిరుపతి బ్యూరో, ఫిబ్రవరి 13 - (రిపబ్లిక్ న్యూస్) -** తిరుపతి జిల్లాలో అంగన్వాడీల పై రోజు రోజుకు వేధింపులు పెరుగుతున్నాయని, వారికి రక్షణ కల్పించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ కు సిఐటియు నేతలు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లో సిఐటియు నేతలు కలెక్టర్ కు జిల్లాలో నెలకొన్న పరిస్థితులను వివరించారు. అధికార పార్టీ నేతల అండదండలతో కొందరు రెచ్చిపోయి వ్యవహరిస్తున్నారని, అంగన్వాడీ కార్యకర్తలకు రక్షణ కల్పించాలని కోరారు. అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులు వత్తుతూ అంగన్వాడీల జీవితాలతో చెలగాటమాడుతున్న శ్రీకాళహస్తి ప్రాజెక్టు సిడిపిఓ శాంతి దుర్గపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా



కలెక్టర్ వెంకటేశ్వర్ కు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, జిల్లా అధ్యక్షులు ఎస్. జయచంద్ర, సిఐటియు నేతలు వి. నాగరాజు, రాధాకృష్ణ లు వినతిపత్రం సమర్పించారు. తాజాగా శ్రీకాళహస్తి ప్రాజెక్టు ఎంపేడు సెక్టార్ అంగన్వాడి కార్యకర్త పి. సౌజన్య పై ఎంపేడు గ్రామంలోని అధికార పార్టీకి చెందిన ఈశ్వర్ రెడ్డి అనే వ్యక్తి వేధింపులకు పాల్పడుతూ ఇబ్బంది పెడుతున్నాడని దీనికి అధికార పార్టీ నేతలు తానా తందానా అంటూ వ్యవహరించటం దారుణమని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇద్దరు పసిపిల్లలతో ఒంటరి మహిళగా జీవిస్తున్న సౌజన్య పట్ల అధికార పార్టీ నేతలు మూకుమ్మడి దౌర్జన్యాలకు పాల్పడడం సమంజసం కాదని, వారి దౌర్జన్యాలకు వత్తాసుగా సిడిపిఓను
ఓ మహిళ అయ్యుండి వారికి సహకరించటం మరింత సిగ్గుచేటని ఆరోపించారు. సౌజన్యకు నోటీసులు ఇవ్వకుండానే ఇప్పటికే రెండు నోటీసులు ఇచ్చినట్టుగా రికార్డులు సృష్టించారని, అనవసర వివాదాలను ఆమె చుట్టూ సృష్టించడమే కాకుండా స్వయంగా ఐసీడీఎస్ అధికారులు ప్రాజెక్ట్ స్థాయిలో కక్ష్య కట్టి వ్యవహరిస్తున్నారని, వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని అధికార పార్టీ నేతలకు అధికారి అయ్యుండి సహకరిస్తున్న సిడిపిఓపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. జరిగిన ఘటనలపై సమగ్ర విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేస్తానని తిరుపతి జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు.

# రాష్ట్ర ఖజానాకు రెవెన్యూను అందించే శాఖలు రెవెన్యూ ఆదాయ లక్ష్యాలను అధిగమించాలి..

**- మున్సిపల్ మరియు పంచాయతీరాజ్ శాఖలలో జరిగే పనులపై జీఎస్టీ వసూళ్లు పక్కాగా జరగాలి..**

**- మోటార్ వెహికల్ వాహనాల షోరూములలో ధరల పట్టిక ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలి..జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**

**ఏపీ బ్యూరో, ఫిబ్రవరి 13 - (రిపబ్లిక్ న్యూస్) -** మదనపల్లి :- రాష్ట్ర ఖజానాకు రెవెన్యూ అందించే శాఖలు రెవిన్యూ ఆదాయ లక్ష్యాలను అధిగమించాలని, మున్సిపల్ మరియు పంచాయతీరాజ్ శాఖలలో జరిగే పనులపై జీఎస్టీ వసూలు పక్కాగా జరగాలని మోటార్ వెహికల్ వాహనాల షోరూములలో ధరల పట్టిక ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలని, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మదనపల్లి కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో జిల్లాలో రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని అందించే ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, రవాణా శాఖ, మైనింగ్, రిజిస్ట్రేషన్, అటవీ శాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ లకు ఆదాయ వనరుల పెంపుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని శాఖల వారీగా ఆదాయ సాధన పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖపై సమీక్షిస్తూ నాటు సారా మరియు నకిలీ మద్యం అమ్మకాలు జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో ఉండరాదని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. సమీప కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి మద్యం అక్రమ రవాణా కాకుండా గట్టి నిఘా పెంచాలని వీటి అమ్మకాలు జరగడం వల్ల రాష్ట్ర ఖజానాకు గండి పడడమే కాకుండా ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని ఈ అంశంపై ఎలాంటి ఉపేక్ష ఉండరాదని కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీఎస్టీ శాఖపై సమీక్షిస్తూ జీఎస్టీ వసూళ్ల పై పెండింగ్ లో బకాయిలు, కేసుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ శాఖలు, కాంట్రాక్టర్లు నుండి రావలసిన వసూళ్లకు సంబంధించిన వివరాలను వివిధ శాఖల అధికారులు జీఎస్టీ శాఖ అధికారులకు అందజేయాలని సమన్వయంతో కలిసి పనిచేసి జీఎస్టీ వసూళ్లను పెంచాలని ఆదేశించారు. పెండింగ్ జీఎస్టీ బకాయాలను సమీక్షించుకొని వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. పన్ను ఎగవేతను అరికట్టేందుకు ప్రత్యేక ఇన్ఫోస్ మెంట్ డ్రైవ్ నిర్వహించి, ఫేక్ బిల్లులు బోగస్ సంస్థలపై కఠిన చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. రవాణా శాఖ పై సమీక్షిస్తూ జిల్లాల్లో ఉన్న మోటార్ వెహికల్ షోరూమ్‌లలో వాహనాల ధరల పట్టిక లో ఇన్వాయిస్ ధరను



వినియోగదారులకు స్పష్టంగా ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇన్వాయిస్‌లో చూపిన ధర కంటే ఎక్కువ మొత్తాన్ని ఎవరైనా డీలర్ డిమాండ్ చేసినట్లయితే, వినియోగదారులు వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి అక్రమాలకు సహకరించకుండా చట్ట పరిరక్షణకు తోడ్పడాలని ప్రజలను కోరారు. ప్రజలు వాహనాలు కొనుగోలు చేసేటప్పుడు కొనుగోలుదారుల నుండి అధికారిక బిల్లుల కన్నా ఎక్కువ వసూలు చేయకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రవాణా శాఖ అధికారులు తరచుగా షోరూమ్‌లను పర్యవేక్షించి ప్రజలతో మమేకమై వారికి అవగాహన కల్పించాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. ప్రతి త్రైమాసికానికి పన్నులు కట్టాల్సిన వాణిజ్య వాహనాలపై తనిఖీలు నిర్వహించి, వాటిని గుర్తించి పన్నుల ఎగవేతదారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ పై సమీక్షిస్తూ ఇంజనీరింగ్ శాఖకు సంబంధించిన ప్రతి బిల్లులో జీఎస్టీ ఉండేలా చూడాలని ఆదేశించారు. వాణిజ్య పన్నుల శాఖతో సమన్వయం చేసుకొని జీఎస్టీ ని రాష్ట్ర ఖజానాకు అందేలా చూడాలన్నారు. మున్సిపల్ శాఖ మరియు పంచాయతీలపై సమీక్షిస్తూ మునిసిపల్ శాఖలో చేసిన పనులకు జీఎస్టీ శాఖతో సమన్వయం చేసుకొని జీఎస్టీ వసూలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీలు మరియు పంచాయతీలు సకాలంలో పన్నులు వసూలు చేయాలని, జిల్లాలోని లేఔట్ లపై తనిఖీలు నిర్వహించి



అనధికారిక లేఔట్ లపై జరిమానాలు విధించాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని అధికారులకు ఆదేశించారు. మైనింగ్ శాఖ పై సమీక్షిస్తూ జిల్లాలో నిరుపయోగంగా ఉన్న మైనింగ్ లీజులను ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం వెంటనే పునరుద్ధరించి మైనింగ్ ప్రారంభించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ శాఖపై సమీక్షిస్తూ ప్రజలకు రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ పై అవగాహన పెంచి ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి చుక్కల భూములు, 22ఏ లపై ఇచ్చిన ఆదేశాలను ఆలస్యం చేయకుండా అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సమయపాలన పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడం కోసం అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ప్రతినెల దీనిపై సమీక్ష సమావేశం సంబంధిత శాఖలతో జరుగుతుందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటూ రెవెన్యూ ఆదాయ శాఖల్లో వృద్ధి సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆదాయం తెచ్చిపెట్టే వనరులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, లక్ష్య సాధనలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా కట్టుదిట్టంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ, రవాణా శాఖ, జీఎస్టీ, డిపిఓ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, మైనింగ్, అటవీ శాఖ, మదనపల్లి, పుంగనూరు, బి. కొత్తకోట మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు..

# గ్రామస్తుల కన్నెర..ఈ సెక్రటరీ మాకొద్దు..

## గట్టు సెక్రటరీ నాగమల్లు నిర్లక్ష్యం పై కలెక్టర్ కు ఫిర్యాదు..

**అన్నమయ్య జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 13 - (రిపబ్లిక్ న్యూస్) -** మదనపల్లి :- బి. కొత్తకోట మండల కేంద్రమైన గట్టు పంచాయితీ సెక్రటరీ నాగమల్లుపై నాయనబాయి, గట్టు పంచాయతీ ప్రజలు శుక్రవారం మీడియా ద్వారా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఇతను గతంలో పని చేసిన పంచాయతీల్లోను సక్రమంగా విధులు నిర్వహించలేదని అప్పటినుండి ఇతనిపై పలు ఆరోపణలు ఉన్నాయని ఈ ప్రభుత్వం వచ్చాక కూడా గట్టు గ్రామపంచాయతీకి బదిలీపై వచ్చి ఇక్కడ కూడా విధులు సక్రమంగా నిర్వహించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సచివాలయంకు వెళ్లే ప్రజలను నిర్లక్ష్య ధోరణితో మాట్లాడుతూ వారి చెప్పే పనులు చేయకపోవడమే కాకుండా అసభ్యంగా మాట్లాడుతాడని అందుకే ఇతనిని గట్టు పంచాయతీ నుండి బదిలీ చేయాలని



గ్రామస్తులు దాదాపు 100 మంది సంతకాలు పెట్టి అర్జీ రూపంలో ఫిర్యాదు చేశారు. అలాగే బి. కొత్తకోట మండల డిప్యూటీ ఎంపీడీవోను కలిసి వినతి పత్రమందించి తమ గోడును వెళ్ళబోసుకున్నారు. ఇటీవల సహచర ఉద్యోగులపై కూడా ఇతను నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తారని సాక్షాత్తు సచివాలయ ఉద్యోగులు డి ఎల్ పి ఓ కి ఫిర్యాదు చేయడానికి సమాయత్తమవుతున్న తరుణంలో స్థానిక ఎంపీడీవో చొరవ తీసుకొని సచివాలయంలోనే సమస్య పరిష్కరించుటకు చర్యలు చేపట్టారు. అయినా కూడా ఉద్యోగులు ఇతని పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజలు చారవాణి ద్వారా మాట్లాడాలనుకుంటే ఫోను స్విచ్ ఆఫ్ చేస్తాడని ఫోను కూడా ఎత్తడని ఆరోపించారు. ఇతను పై చర్యలు తీసుకొని గట్టు పంచాయతీ నుండి వెంటనే బదిలీ చేయాలని లేనియెడల రెండు గ్రామపంచాయతీల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు..

# వేంపెంట గ్రామంలో మృతి చెందిన దండగల.భూషమ్మ కుటుంబానికి సింగపూర్ డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు తరపున 5వేలు ఆర్థిక సహాయం అందించిన మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ

**పాములపాడు ఫిబ్రవరి 13 రిపబ్లిక్ న్యూస్:-** పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామంలో దండగల భూషమ్మ మృతి చెందిన విషయం తెలుసుకోని, మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ, గ్రామ నాయకులతో కలిసి ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.అనంతరం ఆమె కుటుంబానికి సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు & అంతర్జాతీయ సమాజ సేవకుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు తరపున 5000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ధైర్యంగా ఉండాలని మీకు అన్ని విధాలుగా తోడుగా ఉంటామని మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ బోనపల్లె వినయ్ కుమార్, బోనాల భాస్కర్, జనసేన శేషు, తాటిపాటి నాయుడు, మద్దూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# వంక పై చేపడుతున్న నిర్మాణాన్ని ఆపాలని కలెక్టర్ కు గ్రామస్తుల మొర..

**రాజంపేట సబ్ కలెక్టర్ తో సహా ఉన్నత స్థాయి అధికారులకు విన్నవించుకున్న ఫలితం శూన్యమని గ్రామస్తుల ఆందోళన..**



**అన్నమయ్య జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 13 - (రిపబ్లిక్ న్యూస్) -** సుండుపల్లి మండల పరిధిలోని ముడుంపాడు పంచాయతీ కురవపల్లి గ్రామం లో ఊరిని ఆనుకొని వంకపై వాగులో పిల్లర్లు వేసి పైన అక్రమంగా చేపడుతున్న నిర్మాణ పనులను ఆపాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కు గ్రామస్తులు మీడియా ద్వారా విన్నవించుకున్నారు. ఈ విషయంపై రాజంపేట సబ్ కలెక్టర్ భావన, తహసిల్దార్ మహబూబ్ చాంద్, ఇరిగేషన్ ఏ ఈ ఈ నాగేంద్ర నాయక్ లకు ఇప్పటికీ పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్మాణం జరిగితే గ్రామంలో దాదాపు 200 ఇండ్లు ముంపునకు గురయ్యే ప్రమాద ముందని కాబట్టి నిర్మాణాన్ని ఆపాలని మీడియా ద్వారా వేడుకున్నారు. సంబంధిత అధికారులకు దీనిపై పలుమార్లు తెలియజేసిన స్పందించకపోవడంతో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయాలని భావించామని గ్రామస్తుడు తుపాకుల నాగరాజు తో పాటు గ్రామస్తులు వినతిపత్ర మందించి తమ గోడును కలెక్టర్ కు విన్నవించుకుంటామని దీనికి మీడియా కూడా సహకారం కావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# భవిష్యత్తు డాక్టర్లుకు మెరుగైన నైపుణ్యాలు..

**విద్యార్థుల భవిష్యత్ కెరీర్ ప్రణాళికలపై మార్గనిర్దేశనం..**





**చిత్తూరు బ్యూరో, ఫిబ్రవరి 13 - (రిపబ్లిక్ న్యూస్) -** చిత్తూరులోని అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఎఐఎంఎస్ఆర్)లో శుక్రవారం ఎంబీబీఎస్ తొలి సంవత్సర విద్యార్థులు వారి తల్లిదండ్రుల సమావేశం విజయవంతంగా నిర్వహించారు. ఈ సమావేశాన్ని అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫస్ట్ ఇయర్ ఎంబీబీఎస్ విద్యార్థులు సాంకేతికంగా ఇంకా చిన్న వయస్సులోనే అత్యంత క్లిష్టమైన వైద్య విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. వారికి మెరుగైన నైపుణ్యాలు సాధించేందుకు ఏఐఎంఎస్ఆర్‌లో అనుభవం, సేవాభావం కలిగిన ఫ్యాకల్టీ సభ్యులు సమర్థంగా మార్గనిర్దేశనం చేస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రుల బాధ్యత ఎప్పటికీ ముగియదని, ఉపాధ్యాయులు విద్యార్థులకు రెండవ తల్లిదండ్రులుగా ఉంటారని చెప్పారు. ఫస్ట్ ఇయర్ చదువు కఠినమైన, గట్టి పాఠ్యాంశాలతో కూడినదని, విద్యార్థులకు బలమైన పునాదులు వేయడంలో ఎఐఎంఎస్ఆర్ ముఖ్య పాత్ర పోషిస్తోందని తెలిపారు. విద్యార్థుల అకడమిక్ ప్రగతి, క్లినికల్ ట్రైనింగ్, రాబోయే విద్యా అవకాశాలు, పరిశోధనలో పాల్గొనే అవకాశాలు వంటి అంశాలపై తల్లిదండ్రులతో సమాలోచన చేయడం ఈ సమావేశం ప్రధాన లక్ష్యమని వివరించారు. మెంటర్‌మెంటీ వ్యవస్థ ద్వారా విద్యార్థుల వ్యక్తిగత, విద్యా సంబంధిత సమస్యలకు పరిష్కారం లభిస్తోందని, ఇటువంటి సమావేశాలు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ (రిసెర్చ్) డాక్టర్ ఉషా అడిగ, ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ రమ్యా, అనాటమీ విభాగాధిపతి డాక్టర్ తెరిస రాణి, డాక్టర్ శ్రవణ దీప్తి తదితర ఫ్యాకల్టీ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తల్లిదండ్రుల ప్రశ్నలకు సమాధానమిస్తూ విద్యార్థుల భవిష్యత్ కెరీర్ ప్రణాళికలపై మార్గనిర్దేశనం చేశారు.

# కన్నుల పండుగల ఆవుల పబ్బం

**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 13 రిపబ్లిక్ న్యూస్** మండలంలోని పశ్చిమ పంచాయతీలైన టువంటి గ్రామాల్లో ఆవుల పబ్బాన్ని కన్నుల పండుగలా నిర్వహించారు సంక్రాంతి పండుగ ఎరువుగని 12 గ్రామాల ప్రజలు పశువులను అందంగా అలంకరించి ఉదయాన్నే పరికిదునకు సమీపంలోని కాటమరాజు ఆలయం వద్దకు చేరుకున్నారు అక్కడ ప్రదర్శన నిర్వహించారు. వాటితో పాటు చాందిని బండ్లు వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రదర్శన గావించారు. గతంలో ఎన్నడు లేని విధంగా అత్యంత సంఖ్యలో భక్తులు చేరుకొని స్వామివారికి పూజలు నిర్వహించారు. ముఖ్యంగా మహిళలు 12 గ్రామాలకు చెందిన వనదేవతలను పూజించుకుంటూ కాటమరాజు ఆలయానికి చేరుకున్నారు అత్యధిక సంఖ్యలో మహిళలు స్వామివారిని ఆరాధించారు. అనంతరం కలసి మెలసి సహపంక్తి భోజనాలు నిర్వహించారు.



## దామోదరం సంజీవయ్య 105వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి : దళిత జేఏసీ పిలుపు

### కలెక్టర్ కార్యాలయం నుంచి నంద్యాల చెక్‌పోస్ట్ వరకు భారీ ర్యాలీ



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 13)**
మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 105 వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కర్నూలు జిల్లా దళిత జేఏసీ పిలుపునిచ్చింది. ఈ మేరకు దళిత జేఏసీ ప్రతినిధులు జిల్లా అధికారులతో చర్చించి, దళిత ముఖ్యమంత్రిగా నిలిచిన సంజీవయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరినట్లు జిల్లా దళిత జేఏసీ చైర్మన్ నాయకులు సోమ సుందరం మాదిగ తెలిపారు. దీనికి జిల్లా అధికారులు సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం, కలెక్టర్ కార్యాలయం నుంచి నంద్యాల చెక్‌పోస్ట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొననున్నారని తెలిపారు. కార్యక్రమంలో దళిత జేఏసీ చైర్మన్ నాయకులు సోమ సుందరం మాదిగతో పాటు జయకుమార్ (విన్సెంట్) మాదిగ, ముప్పసాని సుధాకర్ మాదిగ, ఎం. రాజు మాదిగ, ప్రసాద్ మాదిగ, సిద్దయ్య మాదిగ, ప్రభాకర్ మాదిగ, శ్రీరాములు మాదిగ, అలాగే ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షురాలు రెడ్డిపోగు కళావతి, ప్రధాన కార్యదర్శి బండారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ మాఫియాను అరికట్టాలి

### పి పి పి విధానాన్ని రద్దు చెయ్యాలి - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్

**గుంతకల్ ఫిబ్రవరి 13 (రిపబ్లిక్ న్యూస్)**
దేశవ్యాప్తంగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మెడికల్ మాఫియాను అరికట్టాలని శుక్రవారం స్థానిక బీటీ పకీరప్ప భవనం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జగదీష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన విద్య వైద్యం ఆహారం ప్రాథమిక హక్కులను ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా వ్యాపారంగా మారి సామాన్యుల పాలిట విశేషార్పమై వేధింపులకు గురిచేస్తుందన్నారు. స్థానిక గల్లి నుండి దేశాంతరం వరకు మెడికల్ మాఫియా ప్రజా జీవిత దోపిడీ కొనసాగిస్తున్నారని ఇది కేవలం ప్రభుత్వాల ప్రజా హక్కుల నిర్లక్ష్యమేనని ఆయన భావోద్వేగంతో పునరుద్ఘాటించారు. నాణ్యతలేని బోగస్మందులను ప్రజలకు అందించడం, నకిలీ మందులు, నిషేధిత మందులు విచ్చలవిడిగా మార్కెట్లో ప్రవేశపెట్టి ప్రజా ఆరోగ్యాలను ప్రమాదంలోకి నేటుతున్నాయన్నారు. ప్రజలు డాక్టర్లతో బేరం మాడలేని స్థితి ఎలా కోవడంతో వారు చెప్పిందే రేటుగా ఆర్థికంగా హింసకు గురవుతూ చావు బ్రతుకుల మధ్య హింసను అనుభవిస్తున్నారు. డ్రగ్ కంట్రోల్ వ్యవస్థ బలోపేతం చేసిన బాధ్యులపై చర్యలు తీసుకుని వారిని శిక్షించే అధికారం లేకపోవడం దౌర్భాగ్యం అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల దందా చెప్పడానికి నోరు చాలదని వారిని నియంత్రించే వ్యవస్థ లేకపోవడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రి లలో అనవసరమైన ఆపరేషన్లు, రక్త పరీక్షలు, స్కానింగ్లు చేస్తూ పేద ప్రజల నుండి లక్షలకు లక్షలు వసూలు చేస్తున్నారన్నారు. ప్రాణ భయం పేరుతో బ్లాక్ మెయిల్ చేస్తూ ప్రజా దోపిడీకి పాల్పడుతున్నటువంటి ఇటువంటి ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకుంటూ ప్రజా రక్షణ కల్పించాల్సిన అవసరం ఈ ప్రభుత్వాలకు ఉందని ఆయన ఉద్ఘాటించారు. ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ప్రజలకు తెలియజేసేందుకు ఫిబ్రవరి 14వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను నిర్వహిస్తున్నమన్నారు. అప్పటికి కూడా ప్రభుత్వ చర్యలలో మార్పు లేకపోతే అన్ని వామపక్ష పార్టీలను, ప్రజా సంఘాలను కలుపుకొని దశలవారీగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా సమితి సభ్యులు వీరభద్ర స్వామి, ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి మహేష్, ఏఐటీయూసీ మండల్ నాయకులు ఈశ్వరయ్య, ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు దాసరి శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు




## శెనగల లో కలిపే టాబ్లెట్స్ మింగి
# వివాహిత ఆత్మహత్య

**చిప్పగిరి, ఫిబ్రవరి 13, (రిపబ్లిక్ న్యూస్ )**
చిప్పగిరి మండలం నంచర్ల గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గుడిసె సావిత్రి (34) అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు, పోలీసుల కథనం ప్రకారం నంచర్ల గ్రామానికి చెందిన గుడిసె మహేష్ భార్య సావిత్రి గత నెల రోజులుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో, గురువారం 12 వ తేదీ సాయంత్రం 6 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని తరుణంలో, మనస్తాపానికి గురై శనగ పంటకు వాడే అల్యూమినియం ఫాస్పేట్ మాత్రలను మింగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గమనించిన భర్త, వెంటనే చికిత్స నిమిత్తం గుంతకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి (GGH) తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున ఒంటి గంట ప్రాంతంలో ఆమె మృతి చెందింది. కేసు నమోదు మృతురాలి తమ్ముడు బోగప్ప గారి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిప్పగిరి ఎస్సై సి.వి. నరసింహులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అనంతరం బంధువులకు అప్పగించనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



గుడిసె సావిత్రి (ఫైల్ ఫోటో)

# అన్ని పంటలకు కనీస మద్దతు ధరలను చట్టబద్ధం చేయాలి

### జాతీయ కిసాన్ జాగృతి యాత్రకు అఖిలపక్ష రైతు సంఘాల మద్దతు మార్చి 19న ఢిల్లీలో భారీ సభకు పిలుపు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 13)**
రైతులు పండించిన అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధరలు (ఎంఎస్పీ) కల్పించి వాటిని చట్టబద్ధం చేయాలని అఖిలపక్ష రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. కర్నూలు ఎస్టియు భవనంలో ఫిబ్రవరి 7న ప్రారంభమైన జాతీయ కిసాన్ జాగృతి యాత్ర సందర్భంగా రైతు సంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు.
రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. జగన్నాథం అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు జాతీయ కిసాన్ జాగృతి యాత్రలో పాల్గొన్న నాయకులు జల్దీర్ సింగ్ దలేవాల (పంజాబ్), ఇంద్రజిత్ సింగ్ పొన్నెవాల (రాజస్థాన్), దేవరాజ్ కుమార్ (కర్ణాటక), అరుణ్ పటేల్ (మధ్యప్రదేశ్), అభిమన్యు (హర్యానా), సోము అలక్ (పంజాబ్) తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి. రామచంద్రయ్య, జిల్లా నాయకులు నాగేంద్రయ్య, పంపన గౌడ్, పోతులూరి శేఖర్, సుంకన్న, రామకృష్ణారెడ్డి, డి. రాజా సాహెబ్, చింతల మహేష్, తిమ్మయ్య, దంబళం శ్రీనివాసరావు, బి. రాముడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా






నాయకులు మాట్లాడుతూ 2014లో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం పదేళ్లు గడిచినా రైతులను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేక ప్రతి సంవత్సరం సుమారు మూడు లక్షల కోట్ల నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేసి అన్ని పంటలకు చట్టబద్ధమైన ఎంఎస్పీ కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల ఉద్యమాల సందర్భంగా ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు 40 రోజుల పాటు సాగుతున్న జాతీయ కిసాన్ జాగృతి యాత్ర మార్చి 19న ఢిల్లీ రామ్ లీలా మైదానంలో భారీ బహిరంగ సభతో ముగుస్తుందని తెలిపారు. ఆ సభకు ఏపీ నుంచి పెద్ద ఎత్తున రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.
రైతుల అప్పులు మాఫీ చేయడం, ఉచిత విద్యుత్ విధానం కొనసాగించడం, విద్యుత్ చట్టాల రద్దు వంటి డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

# కూటమి ప్రభుత్వం మంచి పాలన అందిస్తోంది

### స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందడుగు: గుడిసె ఆది కృష్ణమ్మ

### 20 నెలల్లోనే విస్తృత సంక్షేమంఅభివృద్ధి కార్యక్రమాలు అమలు; సూపర్ సిక్స్ హామీలు సూపర్ హిట్


**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 13)**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు పూర్తయ్యాయని, ఈ కాలంలో ప్రజలకు విస్తృత సంక్షేమం మరియు అభివృద్ధి కార్యక్రమాలు అందించిందని కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ, గత సార్వత్రిక ఎన్నికలకు ముందు టిడిపిజనసేనబిజెపి కూటమి కలిసి ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు ఆచరణలో విజయవంతమయ్యాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, అలాగే కేంద్ర ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాల వివరాలు వెల్లడిస్తూతల్లికి వందనం కింద రూ.10,090 కోట్లను 67.27 లక్షల




విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. శ్రీ శక్తి పథకం ద్వారా 5 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు కల్పించామని చెప్పారు. దీపం పథకం కింద సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతుల ఖాతాల్లో రెండు విడతల్లో రూ.63.10 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా ప్రతినెల 53 లక్షల మందికి లబ్ధి చేకూరుతోందన్నారు. ఆటో డ్రైవర్లు, నేతన్నలు, మత్స్యకారులు, దివ్యాంగులకు ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. అన్నా క్యాంటీన్ల ద్వారా లక్షలాది మందికి తక్కువ ధరలో భోజనం అందిస్తున్నామని, పలు వృత్తి వర్గాలకు గౌరవ వేతనాలు పెంచామని చెప్పారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామని వెల్లడించారు. రోడ్లు, నీటి సదుపాయాలు, వైద్య కళాశాలలు, విద్యా సంస్కరణలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. ఉచిత ఇసుక విధానం, సోలార్ రూఫ్‌టాప్ పథకం, గృహనిర్మాణ కార్యక్రమాలు పేదలకు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు.
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ 20 నెలల్లో అనేక సంక్షేమఅభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని గుడిసె ఆది కృష్ణమ్మ వివరించారు.

## మహిళల భద్రతే లక్ష్యం గ్రామాల్లో పోలీసుల విస్తృత అవగాహన కార్యక్రమాలు

### సైబర్ నేరాలు, శక్తి యాప్, నూతన చట్టాలపై విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన







**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 13)**
మహిళల భద్రతను ప్రధాన లక్ష్యంగా తీసుకుని కర్నూలు జిల్లా పోలీసు శాఖ విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, రక్షణకు సంబంధించిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా విద్యార్థినులకు సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు, శక్తి యాప్ వినియోగం, నూతన చట్టాల గురించి వివరంగా తెలియజేశారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే డయల్ 100, 112, 1930 హెల్ప్‌లైన్ నంబర్లకు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పోలీసు సేవల గురించి వివరించి, వాటికి ఎలా స్పందించాలో కూడా అవగాహన కల్పించారు.

## మహాశివరాత్రి నాడు కాలిబాటన మల్లికార్జున స్వామి వారి చెంతకు..పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి

**అన్నమయ్య జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 13 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :– స్థానిక నియోజకవర్గ పరిధిలోని తంబళ్లపల్లి మండల కేంద్రంలో విరాజిల్లుతూ సుమారు 800 సంవత్సరాల చరిత్ర కలిగిన అతి పురాతనమైన భక్తులు కోరిన కోరికలు తీర్చే మల్లయ్య స్వామిగా, సంతాన ప్రాప్తి అమ్మవారిగా ప్రసిద్ధికెక్కిన సాదు కొండల మధ్య కొలువైన శ్రీశ్రీశ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయం మహాశివరాత్రి పర్వదినానికి ముస్తాబైంది. ప్రకృతి ప్రేమికులకు అలరాలుతున్న మల్లయ్య కొండ అహ్లాదకరమైన వాతావరణానికి నిలువయింది. స్వాతంత్ర్య కాలంనాటి నుండి వేలాదిమంది భక్తులు స్వామివారి చెంతకు నడకదారిలో వెళ్లి దర్శించుకునేలా ఉండేది. అప్పటినుండి ఎన్నో పార్టీలు అధికారాన్ని శాసించాయి. తంబళ్లపల్లి నియోజకవర్గం నుండి ఎంతోమంది శాసనసభ్యులు ఈ ప్రాంత ప్రజల ఓట్లతో గెలిచారు. కానీ ఏనాడు మల్లయ్య కొండపై శ్రద్ధ చూపించిన దాఖలాలు లేవు. కానీ పది సంవత్సరాల క్రితం తంబళ్లపల్లి నియోజకవర్గానికి పెద్దిరెడ్డి కుటుంబం నుంచి అడుగుపెట్టిన ప్రస్తుత నియోజకవర్గ శాసనసభ్యులు




పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, రాజంపేట పార్లమెంటరీ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి నిరంతర శ్రమతో మల్లికార్జున స్వామి వారి ఆలయ అభివృద్ధికి కంకణం కట్టుకొని రేయింబవళ్లు కంటికి కునుకు లేకుండా ఎంతో శ్రమించి గత వైసీపీ ప్రభుత్వం లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ దృష్టికి తీసుకెళ్లి ప్రజల సమస్యలను తీర్చాలన్న సంకల్పంతో సుమారు పది కిలోమీటర్ల మేర కోట్లాది రూపాయల వ్యయంతో చూడ చక్కనైన రోడ్డు సౌకర్యం వేయించారు. ఆలయం పురాతనమైనది కావడంతో ఆలయ జీర్ణో ధారణ చేసి శ్రీశైలం మల్లికార్జున స్వామి క్షేత్రానికి దీటుగా కట్టాలని భావించి ఎంతోమంది ప్లానింగ్ అధికారుల సూచనలతో పెద్దపెద్ద కాంట్రాక్టర్ల సూచనల ప్రాయంగా ఆలయాన్ని కట్టిస్తున్నారు. అంతే కాకుండా ఆలయం కొండ కింద భాగాన దూర ప్రాంతం నుంచి వచ్చే వేలాదిమందికి అన్నదాన కార్యక్రమ నిర్వహణకు పెద్దిరెడ్డి కుటుంబీకుల సహాయ సహకారాలతో పలువురు దాతల సహకారంతో అన్నదాన సముదాయాన్ని నిర్మించారు. మహాశివరాత్రి పర్వదినాన నియోజకవర్గ శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి సుమారు 10 సంవత్సరాలుగా స్వామివారి చెంతకు కాలిబాటన నడుస్తూ స్వామి వారిని దర్శించుకుంటారు. ఈ సంవత్సరం కూడా అలానే స్వామివారి చెంతకు కాలిబాటన వెళ్లేందుకు శ్రీకారం చుట్టారు. ఆయనతో పాటు శివనామ స్మరణతో వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున నడిచి వెళ్తారు. కాబట్టి వైసీపీ శ్రేణులంతా ఆదివారం వేకువ జామున ఐదు గంటలకల్లా వినాయక స్వామి వారిని దర్శించుకొని శ్రీ నేల మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద నుండి శివ నామ స్మరణతో మొదలుపెట్ట నున్నారని ఆయనతో పాటు అడుగులు వేసే వాళ్ళందరూ చేరుకోవాలని తంబళ్లపల్లి మండల వైసీపీ శ్రేణులు పిలుపునిచ్చారు..

## బోయకొండ గంగమ్మకు రాహుకాల అభిషేకం

**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 13 రిపబ్లిక్ న్యూస్**
శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మకు శుక్రవారం రాహుకాల అభిషేకాన్ని సాంప్రదాయపద్ధంగా నిర్వహించారు ఉదయాన్నే అమ్మవారికి విశేష అభిషేకము అలంకరణ నిర్వహించారు. అనంతరం రాహుకాల సమయంలో భక్తుల సమక్షంలో అమ్మవారిని అభిషేకించారు రాహుకాల అమ్మవారిని అభిషేకించడం వల్ల లోకం సుభిక్షంగా ఉంటుందన్న భక్తుల విశ్వాసం దీంతో అమ్మవారికి విశేష అభిషేకం నిర్వహించారు దేవస్థానం ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం ఆలయ అధికార సిబ్బంది భక్తులకు సేవలు అందించారు.

**అమ్మవారి సేవలో మదనపల్లి న్యాయమూర్తి శిరీష్**
మదనపల్లి న్యాయమూర్తి సురేష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో ఉప కమిషన్ ఏకాంబరం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి రాహుకాల సమయం అనంతరం అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. మండపంలో వేద ఆశీర్వాదం అనంతరం పవిత్ర తీర్థ ప్రసాదాలు అందించి సత్కరించారు.



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
శనివారం 14 ఫిబ్రవరి 2026

## కర్నూలు ఆర్డీవో శ్రీ బుగ్గ రామేశ్వరం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు



**ఓర్వకల్లు ప్రతినిధి, ఫిబ్రవరి 13, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**





ఓర్వకల్లు మండలము, కాల్వబుగ్గ గ్రామము లో ఉన్న శ్రీ బుగ్గ రామేశ్వర స్వామి దేవస్థానము నందు, కర్నూలు ఆర్డీవో ప్రత్యేక పూజలు నిర్వహించి వచ్చే మహాశివరాత్రికి వచ్చే భక్తులందరినీ చల్లగా చూడాలని కాల్వబుగ్గ శ్రీ రామేశ్వర స్వామిని భక్తులు అందరినీ ఆశీర్వదించాలని కోరుకుంటూ ఈనెల 14 నుండి 19 వరకు జరుగు మహా శివరత్రి ఉత్సవాల ఏర్పాట్లను శుక్రవారంరోజు కర్నూలు ఆర్డీవో కోనేరును రథోత్సవమునుఆలయ పరిసర ప్రాంతాలన్నియు పరిశీలించారు, ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు ఎమ్మార్వో, మరియు ఆలయ కమిటీ మరియు ఆలయ జూ లకు భద్రత ఏర్పాట్ల గురించి సూచనలు ఇచ్చి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరపాలని సూచించినారు వచ్చే ప్రతి భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు

## ఘనంగా ఎడ్యుకేషన్ ఫెయిర్

### నిర్వహించిన ఉస్మానియా పాఠశాల.




**నంద్యాల , ఫిబ్రవరి 13, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని ఫరూక్ నగర్ నందు గల ఉస్మానియా పాఠశాల నందు ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి శుక్రవారం ముఖ్యఅతిథిగా ఫయాజ్, అతిథిగా మనియర్ ఖలీల్, పాల్గొని విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రదర్శనల సందర్శించి వారికి ప్రశంస పాత్రలు అందించారు, అనంతరం ఫయాజ్ గారు మాట్లాడుతూ పిల్లలు ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం వలన వారిల ఆలోచనా శక్తి సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీసే మంచి అవకాశం ఉంటుందన్నారు. గౌరవ అతిధి గౌ. ఖలీల్ గారు మాట్లాడుతూ విద్యార్థుల జ్ఞానాన్ని కేవలం తరగతి గదులకు మాత్రమే పరిమితం చేయకుండా ఆచారణాత్మకమైన జ్ఞానాన్ని అందించడంలో ఇటువంటి విద్య ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యునుస్ అహమ్మద్, కరెస్పాండంట్ షేక్షా వలి, ఏవో అబ్దుల్ హాది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చట్టాలపై ప్రతి పౌరుడికి అవగాహన అవసరం

### వక్ఫ్ లాస్ రచయిత ఎ.ఎం.డి. ఇంతియాజ్ విశ్రాంతా ఐఏఎస్

### ఓల్డ్ సిటీ ఉస్మానియా కళాశాలలో వక్ఫ్ లాస్ పుస్తక సమీక్ష సరళ భాషలో చట్టాల వివరణ








**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 13)**

కర్నూలు నగరంలోని ఓల్డ్ సిటీలో ఉన్న ఉస్మానియా కళాశాలలో వక్ఫ్ లాస్ పుస్తక సమీక్ష కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రచయిత ఎ.ఎం.డి. ఇంతియాజ్ విశ్రాంతా ఐఏఎస్ ముందుగా తమ గురువు కృష్ణా రెడ్డి ని, గాంధేయవాది కల్కూర చంద్రశేఖర్ ని సన్మానించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ, చట్టాలపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమని పేర్కొన్నారు. సామాన్యులకు కూడా సులభంగా అర్థమయ్యేలా సరళమైన భాషలో ఈ పుస్తకాన్ని రచించానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2025లో చేసిన సవరణలు, కోర్టు తీర్పులను కూడా పుస్తకంలో క్లుప్తంగా వివరించానన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పుస్తకాన్ని చదివి చట్టాలపై విజ్ఞానం పెంపొందించుకోవాలని ఆయన సూచించారు.

తాను మైనారిటీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేసిన సమయంలో అనేక కోర్టు కేసులు పరిష్కరించాల్సి వచ్చిందని, అదే అనుభవంతో వక్ఫ్ చట్టాలపై సమగ్ర పుస్తకం రాయాలని భావించి బాధ్యతతో రచించానన్నారు. ఈ గ్రంథాన్ని 16 అధ్యాయాలుగా విభజించి, అన్ని అంశాలు అందరికీ అర్థమయ్యేలా రూపొందించామని వివరించారు.

ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, వక్ఫ్ చట్టాలపై ఇలాంటి పుస్తకం సమాజానికి ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఒక విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎంతో కృషితో సాధారణ భాషలో చట్ట అవగాహన కల్పించే గ్రంథం రచించడం అభినందనీయమని ప్రశంసించారు.

పుస్తక సమీక్ష కార్యక్రమంలో లోకాయుక్త కర్నూలు వెంకట రామిరెడ్డి ఐపీఎస్, అబ్దుల్ హక్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్‌కు చెందిన జనాబ్ జావీద్ రషీద్, మెట్రో ఇండస్ట్రియలిస్ట్ జనాబ్ జంషీద్ అలీ ఖాన్, మాంటిసోరి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్‌కు చెందిన రాజశేఖర్, కర్నూలు డిస్ట్రిక్ట్ ఇంటెలెక్టువల్ ఫోరమ్‌కు చెందిన డా. మన్సూర్ రెహమాన్, ఉస్మానియా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సమీఉద్దీన్ తదితరులు, ముస్లిం మైనారిటీ నాయకులు మరియు సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రివర్యులు కీ,శే, దామోదరం సంజీవయ్య 105వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి.- దళిత జే.ఏ.సీ.





**కర్నూలు ప్రతినిధి, ఫిబ్రవరి 13,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగే మాజీ ముఖ్యమంత్రివర్యులు కీ,శే, దామోదరం సంజీవయ్య 105 వ జయంతి వేడుకలలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయగలరని కర్నూలు జిల్లా దళిత జేఏసీ పిలుపునిచ్చింది మొదట కర్నూలు జిల్లా దళిత జేఏసీ జిల్లా అధికారులతో చర్చించి దళిత ముఖ్యమంత్రి అయిన దామోదరం సంజీవయ్య వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరడమైనది అందుకు జిల్లా అధికారులు సానుకూలంగా స్పందించినట్లు కర్నూలు జిల్లా దళిత జేఏసీ చైర్మన్ నాయకులు సోమ సుందరం మాదిగ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు మరియు ప్రజా సంఘాలు పాల్గొంటారని తెలిపారు కలెక్టర్ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య వారి చిత్రపటానికి పూలమాలవేసి తదనంతరం కర్నూలు కలెక్టర్ కార్యాలయం నుండి నంద్యాల చెక్పోస్ట్ వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్టు కర్నూలు దళిత జేఏసీ చైర్మన్ నాయకల్లు సోమ సుందరం మాదిగ తెలిపారు ఈ కార్యక్రమంలో దళిత జేఏసీ చైర్మన్ నాయకలు సోమ సుందరంతో పాటు దళిత నాయకులు జయ కుమార్ (విన్సెంట్) మాదిగ, ముప్పసాని సుధాకర్ మాదిగ, ఎం. రాజు మాదిగ, ప్రసాద్ మాదిగ, సిద్దయ్య మాదిగ, ప్రభాకర్ మాదిగ, శ్రీరాములు మాదిగ, మరియు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పోగు కళావతి, ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి బండారి శైలజ తదితరులు పాల్గొన్నారు

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలుకు

# ముస్తాబైనా కాల్వబుగ్గ క్షేత్రం

### ఫిబ్రవరి 14 నుండి 19 వరకు అంగ రంగ వైభవంగ జరగనున్నాయి

### 17 వ తేది మంగళవారం సాయంత్రం 5 గంటలకు రథోత్సవ కార్యక్రమం



**ఓర్వకల్లు ప్రతినిధి, ఫిబ్రవరి 13,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ శ్రీశ్రీశ్రీ భ్రమరాంభ శ్రీ బుగ్గరామేశ్వర స్వామి దేవాలయం నేషనల్ హైవే కర్నూల్ నంద్యాల మధ్యన హుసేనాపురం గ్రామం సమీపంలో బుగ్గ రామేశ్వర దేవాలయం వెలిసింది ఈ ఆలయం భూమి పొరల కింద నిరంతరం నీరు ప్రవహిస్తూనే ఉంటుంది సుందరమైన రాతి కట్టడాలతో రెండు పుష్కరిణిలు ఉన్నవి ఉత్తరం దిశగా నిర్మించిన పుష్కరిణిలో బుగ్గలు పైకి వస్తూ కనిపిస్తాయి ఈ నీరు కొబ్బరి తోటల సాగు కూడా ఉపయోగపడుతుంది బుగ్గ రామేశ్వర స్వామి దేవాలయం చరిత్ర సుసంపన్నమైన జమదగ్ని కుమారుడు పరశురాముడు తన తండ్రిని సంహరించిన క్షత్రియ రాజులను 21 పర్యాయాలు దేశం నలుమూలల వెతికి నిర్మూలించాడు ఈ రక్తపాతానికి మనస్థాపన చెందిన పరుశురాముడు దేశ అభివృద్ధి కోసం రెండు పచ్చడి కొండల నడుమ



స్వచ్ఛమైన రెండు పుష్కరిణిలో నిర్మించాడు గలగల పారే సెలయేటి ఒడ్డునే శివలింగాన్ని ప్రశ్నించారు అదే నేటి కాలంలో బుగ్గ రామేశ్వర విజయనగర సామ్రాజ్య కాలంలో ఈ ప్రాంతం ముద్దనూరు కాలువ సీమగా పేర్కొంది. తర్వాత క్షేత్రానికి ఉత్తరాన వాయువ్య దిశలో నీటి బుగ్గ ద్వారా ప్రవహించే నీరు ఉషనాపురం కాల్వ గ్రామాల భూములను సస్యశ్యామలం చేయడం వల్ల ఈ ప్రాంతానికి కాల్వబుగ్గ అని పేరు వచ్చింది శివరాత్రి పర్వదినాన పవిత్ర పుష్కరిణిలో స్నానం చేసి ఉపవాసంతో లింగానికి పూజలు చేస్తే కైలాసం వచ్చినట్లేనని భక్తుల నమ్మకం శ్రావణ కార్తీక మాఘ మాసం ఈ పుణ్యక్షేత్రం శ్రావణ కార్తిక మాఘ మాసంలో ఈ పుణ్యక్షేత్రం కళకళలాడుతుంది శివరాత్రి పర్వదినాన పవిత్ర పుష్కరణలో స్నానం చేసి ఉపవాసంతో సాధారణ చేసి శివలింగానికి పూజలు చేస్తారు. బ్రహ్మోత్సవాలు వివరాలు

14న ఉత్సవ మూర్తులు కాల్వ గ్రామం నుంచి కాల్వ బుగ్గకు 15న మహాశివరాత్రి కుంకుమ అర్చన,ధ్వజరారోహణము 16న సింహ వాహన సేవ, నంది వాహన సేవ,సాయంకాలం బ్రహ్మోత్సవం 17న సాయంకాలం రథోత్సవం 18న పగలు వసంతోత్సవం సాయంత్రం పారువేట 19న ఉత్సవమూర్తులు కాల్వ గ్రామమునకు తిరుగు ప్రయాణం


కాటినేని నారాయణ చైర్మన్

టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ ఎమ్ ఎల్ ఏ గౌరు చరిత సహకారంతో క్షేత్ర అభివృద్ధి పనులకు శ్రీకారం

ఆలయం ప్రహరీ నిర్మాణం పూర్తి చేశాము ముడుకోట్ల 20 లక్షలతో భక్తుల సౌకర్యార్థం 16 వసతి గృహాలు ఆలయంలో ఫ్లోరింగ్ ఏర్పాటు చేస్తామన్నారు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు ఈ ఓ మద్దిలేటి

శ్రీ బుగ్గ రామేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఫిబ్రవరి14 నుండి 19 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు వచ్చేటటువంటి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు వసతులు కల్పించి స్వామివారిని అందరూ దర్శించుకునే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. శ్రీ బుగ్గ రామేశ్వర స్వామిని దర్శించుకొని ఆశీస్సులు పొందండి: ఆలయ ప్రధాన అర్చకులు కళ్లెం లక్ష్మీనారాయణ

పుణ్యక్షేత్రాలలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైనటువంటి కాలుబుగ్గ రామేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి శివయ్య ఆశీస్సులు



పొందాలని బ్రహ్మోత్సవాలకు వచ్చేటటువంటి భక్తులు అందరికీ స్వామివారిని దర్శించుకొనుటకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు వరుస క్రమంలో దేవుని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కోరారు





## ఎస్సీ కార్పొరేషన్ భూములు తనిఖీ

### ఆంధ్రప్రదేశ్ ఎస్సీ మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్



**గుత్తి ఫిబ్రవరి 13( రిపబ్లిక్ న్యూస్ )**

అనంతపురం జిల్లా గుత్తి పట్టణములోని ఎస్సీ కార్పొరేషన్ భూములు సందర్శించిన ఎప్ ఎస్సి మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్ విస్తృత తనిఖీలు చేశారు మొదట రజాపురం బాలికలగురుకుల పాఠశాలలో సందర్శించి అక్కడ విద్యార్థు లకు అన్ని సౌకర్యాలు మరియు భోజనాలు సరిగా అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు కర్నూల్ రోడ్డు లో నందు ఎస్సీ కార్పొరేషన్ భూములను సందర్శించి అక్కడ ఎంత మంది లబ్ధిదారులు ఉంటున్నారు అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు అనంతరం ఎన్టీఆర్ సర్కిల్లో గల అంబేద్కర్ కు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి తర్వాత అనంతపురం రోడ్ లో గల బండలు పాలిష్ ఎస్సీ కార్పొరేషన్ భూములు పరిశీలించారు ఎస్సీ కార్పొరేషన్ భూములు కాపాడుకోవడానికి చట్టపరంగా అన్ని చర్యలు తీసుకొని కబ్జాదారులు కాపాడుకోవడానికి ఎప్పుడు నేను ముందు ఉంటానని తెలియజేశారు ఏపీ ఎస్సీ మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్ రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్ కొంకిరి కమలమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడి కుమ్ముదా గడ్డం ముత్యాలు, జి సి నాగప్ప బండల రామాంజనేయులు కోళ్ల రమేష్ మిద్దె ఓబులేసు, పాటిల్ సురేష్, బోయ గడ్డ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు



# కొత్తూరు సుబ్బరాయునిలో టెంకాయల అంగడి వేలము -18.35 లక్షల రాబడి.

## ఆలయ ఈవో యం.రామకృష్ణ.



**పాణ్యం, ప్రతినిధి, ఫిబ్రవరి 13.ప్రజా రిపబ్లిక్ న్యూస్,**

ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నందు శుక్రవారం నిర్వహించిన టెంకాయల అంగడి గుత్త బహిరంగ వేలము వల్ల రూ.18,35,000/- లు రాబడి వచ్చినట్లు ఆలయ ఈవో యం.రామకృష్ణ తెలిపారు. వేలములో 6 మంది సభ్యులు ఒక్కొక్క లక్ష రూపాయలు డిపాజిట్లు చెల్లించగా, నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామానికి చెందిన ఏ.వీరారెడ్డి 18,35000/- హెచ్చు పాట పాడి దక్కించుకున్నారు. గత సంవత్సరం 15,50,000/- పోగా గతం కన్న నేడు 2.85 లక్షలు ఆదాయం వచ్చిందని, అదేవిధంగా పూల అంగడి వేలంలో 5 లక్షల 10 వేలు రాగా, గత సంవత్సరం 4 లక్షల 77 వేలు పోగా 33 వేలు ఆదాయం వచ్చిందని, గాజులు, పటముల అంగడి వల్ల 70,500/- రాగా గత సంవత్సరం 69,500/- వచ్చిందని వీటివల్ల ఒక వెయ్యి రూపాయలు మాత్రం ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. మూడు వేలముల వల్ల గత సంవత్సరం కన్నా 3 లక్షల 19 వేలు ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ వేలము నంద్యాల డివిజనల్ దేవాదాయశాఖ తనిఖీ అధికారి పి.హరిచంద్రారెడ్డి పర్యవేక్షణలో నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, బీరం శివరామిరెడ్డి, బాణా శ్రీనివాస రెడ్డి, ప్రధాన అర్చకులు సురేష్ శర్మ, పోలీసులు సిబ్బంది మరియు వేలం పాటదారులు పాల్గొన్నారు.

# మహా శివోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

## మొదటిసారిగా అరుణాచలేశ్వరుని కళ్యాణ వైభోగం

## భక్తుల కోసం సౌకర్యం కోసం అదనంగా ఏర్పాట్లు - ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా లక్ష్మీప్రసాద్

**అనంతపురం ఫిబ్రవరి 13,(రిపబ్లిక్ న్యూస్):**

నగరంలో మహాశివరాత్రి రోజున మహా శివోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు ఏపీఐఐసి డైరెక్టర్ చల్లా లక్ష్మీప్రసాద్ తెలిపారు. శుక్రవారం రామ్ నగర్ లోని శివ మహోత్సవం సభా ప్రాంగణం వద్ద నేడు చల్లా లక్ష్మీప్రసాద్ పత్రిక సమావేశం నిర్వహించారు.

**నర్మదానదిలోని రాళ్ళతో ప్రత్యేక శివలింగాలు**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరుణాచలేశ్వరుని కళ్యాణం ఆంధ్రప్రదేశ్ లో మొట్టమొదటిసారిగా జరుగుతోందన్నారు. అనంతపురం జిల్లాలోనే తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, నర్మదానదిలోని రాళ్ళతో ప్రత్యేకంగా శివలింగాలను తయారు చేయించామన్నారు.10800 శివలింగాలతో భక్తులచే అభిషేకం జరుగుతుందన్నారు. అరుణాచలేశ్వరుని కళ్యాణం కనులారా తిలకించాలని భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పాస్ ల పంపిణీ చేసామన్నారు. భక్తుల నుండి వస్తున్న స్పందన చూసాక, ముందుగా అనుకున్న 10800 శివలింగాలకు అదనంగా మరో ఐదువేల శివలింగాలను సిద్ధం చేశామని లక్ష్మీ ప్రసాద్ పేర్కొన్నారు.

**అరుణాచలేశ్వరుని కళ్యాణోత్సవం**

అభిషేకానికి కావలసిన పూజా సామాగ్రిని ఉచితంగా అందిస్తున్నామన్నారు. భక్తుల కోసం అల్పాహారం, త్రాగునీటి సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. అరుణాచలేశ్వరుని కళ్యాణోత్సవ అనంతరం, అరుణాచల దేవస్థాన ఆచారం ప్రకారం ఏక హారతి, నక్షత్ర హారతి, నందిహారతి లాంటి అనేక హారతులతో పాటు మహా మంగళహారతి కార్యక్రమం ఉంటుందని ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు.




**ప్రాంగణం చుట్టూ ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు**

సాంకేతికతను పూర్తిగా వినియోగించుకుంటూ డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని డీఎస్పీ తో చర్చించామని ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా లక్ష్మీప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నిధానేత్రాలతో మహా శివోత్సవం కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు.

ఈ సమావేశంలో టిడిపి జిల్లా నాయకుడు కురుబ నారాయణస్వామి,వెంకట చౌదరి,వెంకట రవి తదితరులు పాల్గొన్నారు.

# కట్టు దిట్టమైన ఏర్పాట్ల మధ్య గుండాలకోన భక్తులకు దర్శనం,డ్రోన్ కెమెరాల పహారా

## .డి. ఎస్. పి. శ్రీనివాసరావు.

**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 13 రిపబ్లిక్ న్యూస్.**

మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా రైల్వే కోడూరు నియోజకవర్గం, ఓబులవారిపల్లి మండలం లోని వై. కోట గ్రామానికి అత్యంత సమీపంలో 16కి.మీ. దూరంలో ఉన్న ఆగస్థ మహాముని సప్త గుండాలనడుమున ప్రతిష్టించిన గుండాలేశునికి, రేపు ఆదివారం మహా శివరాత్రి సందర్భంగా అత్యంత వైభవం గా గుండా లేశు నికి పూజలు నిర్వహించడం, భక్తులు దర్శనం చేసుకోవడం జరుగుతుంది. ప్రతి ఏటా మహా శివరాత్రి రోజు వేలాది మంది భక్తులు జిల్లా నలు మూలలనుంచి వచ్చి సప్త గుండాలలో స్నానం ఆ చరించి దేవున్ని దర్శనం చేసుకొనేవారు. ఈ ఏడాది భక్తులకు జలపాత స్థానం నిషేధించడమైనదని, అడవి మృగాలు ఏనుగులు ఎలుగుబంటులు సంచరిస్తుండడం వలన భక్తుల రక్షణ విషయమై నిషేధించడం జరిగినదని డిఎస్పి తెలిపారు ప్రతి ఏటా రెండు మూడు రోజుల పాటు కొనలోనే భక్తులు నిద్రలు చేసి అత్యంత వైభవం గా మహా శివరాత్రి ఉత్సవాలు జరిపి అన్నధానాలు, అనేక సాంకృతిక



కార్యక్రమాలు కోడూరు, వై. కోట గ్రామస్థులు జరిపేవారు. జిల్లాలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్థ మహా ముని ప్రతిష్టించిన విగ్రహాలలో వై. కోట గుండాల కోనకు ఒక గొప్ప ప్రత్యేక చరిత్ర ఉంది. ఇ లాంటి పేరు గాంచిన గుండాలకోనలో గత ఏడాది జరిగిన గజరాజు ల దాడిలో కొంతమంది భక్తులు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఏడాది గుండాలకోనకు వెళ్లేందుకు భక్తులు మరింతగా బయ్యాందోళన చెందు తున్నారు. ఇందులో భాగంగా కోనకు వెళ్లే భక్తులు కు ఈ ఏడాది ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు కలగకుండా డ్రోన్ కెమెరా నిఘాలో పోలీస్, ఫారెస్ట్, శాఖలతో పాటు అన్నిశాఖల అధికారులు మధ్య కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి ప్రజలకు దర్శనం ఏర్పాట్లు చేస్తామని తిరుపతి జిల్లా డి. ఎస్. పి. శ్రీనివాస రావు తెలియజేశారు. ఈవిషయమై ఆయన శుక్రవారం ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్ లో కోడూరు, ఓబులవారిపల్లి, చిట్వేల్, పుల్లంపేట, మండలాలకు చెందిన అన్నిశాఖల అధికారుల్తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన కాలి నడక భక్తులు కు అనుమతి లేదని, దర్శనం కు వెళ్లిన భక్తులు సాయంత్రం 5.గంటలలోపు కొననుంచి తిరిగి రావాలని, వై. కోట నుంచి గుండాలకోనకు 8,బస్సులు ఉదయం 6 గంటల నుంచి భక్తులు సాయంత్రం 3.గంటల వరకు చేరుస్తాయన్నారు.ఆ తర్వాత కొనలో ఉన్న భక్తులు సాయంత్రం 5.గంటలకు అందరు వై. కోట గ్రామానికి చేరుకోవాలని దీనికి భక్తులు సహకరించాలని ఆయన సూచించారు. ఈ సమావేశం లో సి. ఐ, ఎస్. ఐ. లు మహేష్ నాయుడు,వినోద్, రఘురామ్, ఏ ఎస్ ఐ చిట్వేలి యంగయ్య తహసీల్దార్ యామిని, ఎం. పి. డి. వో. విజయరావు, ఎం. ఆర్. ఐ. మల్లికార్జున రెడ్డి, ఫారెస్ట్ రైంజర్ ధాత్తత్రేయ, ఎఫ్. ఆర్. ఒ. బాలచంద్రుడు, వై. కోట పి. ఎచ్. సి. డాక్టర్ నవీన్ కుమార్ అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైష్ణవి దేవి ఆలయంలో మాఘ శుక్రవారం పూజలు

**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 13 రిపబ్లిక్ న్యూస్**

మండలంలోని పుదిపట్ల గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ వైష్ణవి దేవి ఆలయంలో మాఘమాసం శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకురాలు శ్రావణి ఉదయమే అమ్మవారికి ,అభయాంజనేయ స్వామికి, నాగభైరవ స్వామికి, పంచామృత అభిషేకం చేసి అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. చౌడేపల్లి, పుంగనూరు ,మదనపల్లి, చుట్టుపక్కల గ్రామ ప్రజలు అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఈ రోజు ఉభయదారులుగా మదనపల్లికి చెందిన వెంకట్ రమణారెడ్డి, షర్మిల లు వ్యవహరించారు.ఆలయ ధర్మకర్త వినోద్ కుమార్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



# సకల దేవతలను ఆహ్వానిస్తూ శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

## - వైభవంగా ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

## - సకల దేవతలను ఆహ్వానిస్తూ నంది ధ్వజ పటం ఆవిష్కరణ - రావణ వాహనంపై మహానందీశ్వర దంపతులు








**మహానంది, ఫిబ్రవరి 13, (రిపబ్లిక్ న్యూస్)**

మహానంది క్షేత్రం జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ పండితులు, అర్చకులు మహా ధ్వజస్తంభం వద్ద శుక్రవారం రాత్రి ధ్వజారోహణ పూజలు వైభవంగా నిర్వహించారు. ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెందూరి రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జున శర్మ, వేద పండితులు ఋత్విక్కులు, అర్చకులు బృందం మంగళ వాయిద్యాలు, భాజా భజంత్రీల మధ్య శాస్త్రోక్తంగా గణపతి పూజ, ఆవాహన పూజలు జరిపారు. ఉత్సవాల సందర్భంగా చేసిన పుష్పాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేలాది భక్తులు పూజలను తిలకించి భక్తిశ్రద్ధలతో ప్రణమిల్లారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం ఉదయం, సాయంత్రం అనుజ్ఞ, గణపతి పూజ, క్షేత్రపాలక పూజ, వాస్తు శాంతి హోమం, వాస్తు బలి పూజలు వైభవంగా నిర్వహించారు. వేద పండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో మధ్యాహ్నం అంకురార్పణ, కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, భక్తిశ్రద్ధలతో చేశారు. వేద పండితులు, రుత్వికుల వేదమంత్రాలతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పలు ప్రాంతాల భక్తులు వీక్షించారు.

**రావణ వాహనంపై మహానందీశ్వర దంపతులు:**

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందిలో కొలువైన శ్రీ గంగ, కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి దంపతులు శుక్రవారం రాత్రి రావణ వాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేద పండితులు, రుత్వికులు, అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గణపతి పూజ, పుణ్యాహవాచనం, కూష్మాండ బలి, మహా మంగళ హారతులు చేపట్టారు. పలు ప్రాంతాల భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్ రెడ్డి, నీలకంఠేశ్వర రాజు, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.





# ప్రజాసేవకే అంకితం

## 13వ వార్డు కౌన్సిల్ అభ్యర్థి పట్లూరి శివశేఖర్



**ఆందోల్ నియోజకవర్గం ప్రతీనిది ఫిబ్రవరి 13 ( రిపబ్లిక్ న్యూస్)**

అందోల్ జోగుపేట మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాసేవకేఅంకితంగా తన యొక్క వార్డు ప్రజల కోసం ఎంతగానో రుణపడి ఉన్నానని అందులో భాగంగానే ఈరోజు 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా నాపై నమ్మకంతో నన్ను నమ్మి ప్రతి ఒక్క ఓటర్ మహాశయులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ వార్డును అందరికంటే అభివృద్ధిలో ముందుకు తీసుకపోవడంలో కీలక పాత్రధారునిగా పోషింస్తు అన్ని రంగాల్లో వెనకడుగు వేయకుండా ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ వార్డులో చిన్న సమస్య నుంచి పెద్ద సమస్య వరకు కచ్చితంగా నిలబడతా కలబడుతాపోరాడుతా సమస్యను పరిష్కరించేంతవరకు మీ ముందు నేను ఉంటానని మాట ఇస్తున్న మీ పట్లూరి శివ శేఖర్

## ఆందోల్ జోగుపేట మున్సిపల్ ఎన్నికల్లో

# కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం



**ఆందోల్ ప్రతీనిది ఫిబ్రవరి 13 ( రిపబ్లిక్ న్యూస్)**

నాలుగో వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థి తిరుమల కల్పన హరికృష్ణ గౌడ్ గెలుపొందడం జరిగింది ఐదవ వార్డ్ కొత్తగొల్ల మాధవి శ్రీనివాస్ గెలుపొందడం జరిగింది ఆరవ వార్డ్ రాచకొండ జ్యోతి ప్రదీప్ గౌడ్ గెలుపొందడం జరిగింది ఏడవ వార్డ్ తోట్ల రామకృష్ణ గెలుపొందడం జరిగింది

## మినిస్టర్ రంగంలోకి దిగిన గెలుపు తన వైపుఅని ధీమా వ్యక్తం చేసిన నాగరత్నం గౌడ్ భవాని


**ఆందోల్ నియోజకవర్గ ప్రతినిధి ఫిబ్రవరి 13(( రిపబ్లిక్ న్యూస్)**

ఆందోల్ జోగుపేట మున్సిపల్ ఎన్నికల్లో 8వ వార్డులో స్వయంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ తన అనుచరులతో పకడ్బందీగా బి ఆర్ఎస్ కాండేట్ను ఒడగొట్టాలని కంకణం కట్టుకొని తన సన్నిహిత కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను ఆ వార్డులో ఉంచి అధికార అహంకారం తో డబ్బులు విచ్చలవిడీగా పంచుతు ఆందోల్ లో ఎవరు గెలిచినా సరే కానీ ప్రత్యార్థి వ్యక్తి గెలవద్దని కంకణం కట్టుకొని రాత్రి పగలు తేడా లేకుండా ఆయన ఒక మంత్రిగా ఉండి ఒకఅభ్యర్థి పై ఫోకస్ చేయడం ఎంత దారుణం అంటే మొదటినుంచి తనపై పోటీ చేయాలంటే ఎవరు ముందుకు రాని సమయంలో ఒక వ్యక్తిని తయారు చేసి పోటీలో దించి అన్ని విధాల ఆయనకు సహకరించిన కూడా 8వ వార్డు అడ్డా నాగరత్నం గౌడ్ భవాని వాళ్ల చేసిన సేవ వాళ్ళు చేసిన పని విధానానికి ఇదే నిదర్శనం నా వార్డులో ఫోకస్ చేసిన మంత్రికి సిగ్గు చరశీ ఉండాలి ఎందుకంటే ప్రజలు సేవ చేసే వ్యక్తికి అందుబాటులో ఉండే వ్యక్తికి ఓట్లేస్తారు కానీ మీరు ఒక రోజులో మద్యం డబ్బులు విపరీతంగా పంచిన మాత్రన ఓటర్లు మారరు అనేది ఈ గెలుపుతోని ఒక నిదర్శనం అని నాయకులు తెలుసుకోవాలి

## 15వ వార్డు ప్రజలకు నాపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలియజేసిన చిట్టిబాబు సత్యనారాయణ

**ఆందోల్ ప్రతినిధి ఫిబ్రవరి 13( రిపబ్లిక్ న్యూస్ )**

ఆందోల్ జోగిపేట మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు సేవ చేసే గుణం కలిగిన వ్యక్తికి పట్టం కట్టారు అదే 15వ వార్డు ప్రజలు మీ అమూల్యమైన ఓటు వేసి నన్ను గెలిపించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసిన చిట్టిబాబు సత్యనారాయణ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో నన్ను ఆశీర్వదించి కౌన్సిలర్గా గెలిపించిన నా ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటాను వాడు అభివృద్ధిని అందరితో కలిసి మెలిసి ఉంటూ ప్రతి సమస్యపై స్పందిస్తూ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి పరచుకుందాం చేసే బాధ్యత నాది మంత్రి దామోదర్ రాజన్న గారి ఆశీస్సులతో అన్ని రంగాల్లో సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి వచ్చే విధంగా నా సొంత వ్యక్తిగత సంబంధాలతో మంచి చెడు ఏది ఉన్న మీ కోసం నేను ఉంటారని ఆయన మాట్లాడారు




# రచయితగా మొదలై

## దర్శకుడిగా ఎదిగిన ఈశ్వర్ చల్లా

**ప్రకాశం బ్యూరో ఫిబ్రవరి 13 - (రిపబ్లిక్ న్యూస్)**



సినిమా రంగంలో రచయితగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన ఈశ్వర్ చల్లా, ఇప్పుడు దర్శకుడిగా తన ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంటున్నారు. కథలపై ఉన్న ఆసక్తి, భావాలపై ఉన్న పట్టుదల ఆయనను ఈ స్థాయికి తీసుకువచ్చాయి. రచయితగా ఆయన రాసిన కథలు భావోద్వేగంతో పాటు సమాజానికి సంబంధించిన అంశాలను ప్రతిబింబించాయి. ప్రేక్షకులను ఆలోచింపజేసే విధంగా ఆయన రచనలు నిలిచాయి. అదే దృక్పథాన్ని దర్శకుడిగా కూడా కొనసాగిస్తూ, కథను కేవలం వినిపించడమే కాకుండా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. దర్శకుడిగా మారడం ఆయనకు ఒక సాధారణ మార్పు కాదు. కథలోని ప్రతి భావాన్ని తెరపై స్పష్టంగా చూపించాలనే ఆతృత ఆయన పనిలో కనిపిస్తుంది. ప్రతి సన్నివేశంలో నిజాయితీ, ప్రతి ఫ్రేమ్‌లో స్పష్టమైన ఆలోచన ఉండేలా కృషి చేస్తున్నారు. రచయితగా పొందిన అనుభవం ఆయనకు దర్శకుడిగా బలంగా మారింది. పదాల్లో చెప్పిన భావాలను ఇప్పుడు దృశ్యాల్లో ఆవిష్కరిస్తూ, తనదైన ప్రపంచాన్ని నిర్మిస్తున్నారు. సినిమా రంగంలో తన కృషి, పట్టుదలతో ముందుకు సాగుతున్న ఈశ్వర్ చల్లా, భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలను అందిస్తారనే నమ్మకం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# నల్లమలలో కొలువైన శ్రీ గుండ్ల బ్రహ్మేశ్వరుడు

### మహా శివరాత్రి రోజునే స్వామి దర్శనం

**బండి ఆత్మకూరు, ఫిబ్రవరి 13,(రిపబ్లిక్ న్యూస్):-**

నల్లమల అభయారణ్యంలో వెలసిన పరమ పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీ గుండ్ల బ్రహ్మేశ్వర ఆలయం. స్వామి వారి దర్శన భాగ్యం భక్తులకు ఏడాదికి ఒక్కసారి మాత్రమే దక్కుతుంది. ఈ అవకాశం కోసం భక్తులు ఏడాది కాలంగా ఎదురు చూస్తూ ఉంటారు. మహాశివరాత్రి పర్వదినం ఎప్పుడు వస్తుందా.. ఎప్పుడు వెళ్లి స్వామి వారిని దర్శించుకోవలా అని భక్తులు ఆరాటపడుతుంటారు. కాగా మహాశివరాత్రి పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు వసతి సదుపాయాలు కల్పిస్తుంది.





భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని అటవీ అధికారులు అన్ని రకాల వాహనాల రాకపోకలకు ఎటువంటి ఆంక్షలు లేకుండా అందరికీ అనుమతి ఇస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

### శ్రీ గుండ్ల బ్రహ్మేశ్వర క్షేత్ర విశిష్టత

ద్వాపర యుగంలో అశ్వత్థామ స్వయంగా ఇక్కడ శివలింగాన్ని ప్రతిష్టించారని పురాణాలు చెబుతున్నాయి. 1945లో బ్రిటిష్ అటవీ అధికారి జోసెఫ్ సంజీవరావు ద్వారా ఈ ఆలయం వెలుగులోకి వచ్చింది. నారాయణపురం గ్రామస్తుల నిరంతర కృషితో నేడు భక్తులందరికీ దర్శనమిస్తోంది. మహా శివరాత్రి పురస్కరించుకొనిఈ నెల15 ,16 తేదీలలో స్వామివారి కళ్యాణం, క్షేత్రోత్సవం అత్యంత వైభవంగా జరగనున్నాయి. అయితే స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొనేందుకు కర్నూలు, నంద్యాల, జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో క్షేత్రానికి చేరుకుంటారు. వారందరి కోసం నారాయణపురం గ్రామస్తుల సహకారంతో భక్తులందరికీ రెండు రోజుల పాటు నిరంతర అన్నదానం కల్పించబడుతుంది. భ

### క్షేత్రానికి చేరుకునే రవాణా మార్గాలు

బండి ఆత్మకూరు మండలం, నారాయణపురం గ్రామం నుండి 10 కి.మీ. అటవీ మార్గం ద్వారా కాలినడకన చేరుకోవచ్చు. అలాగే దిగువమెట్ట (గిద్దలూరు) నుంచి సుమారు 20 కి.మీ. దూరం ఉంటుంది. ట్రాక్టర్లు లేదా పాపినేనిపల్లి (ప్రకాశం జిల్లా) సుమారు 25 కి.మీ.దూరం ఉంటుంది. కాలినడకన లేదా వాహనాల ద్వారా చేరుకునే వీలుంది. అయితే నారాయణపురం గ్రామం నుంచి చిన్నదేవలాపురం, నారాయణపురం గ్రామ ప్రజలు భక్తుల రాకపోకల కోసం ఉచిత ట్రాక్టర్ సదుపాయాన్ని ఏర్పాటు చేసి కొండమొత్త వరకు తీసుకువెళ్తారు. అక్కడి నుంచి భక్తులు కాలినడకన శ్రీ గుండ్ల బ్రహ్మేశ్వర ఆలయానికి చేరుకుంటారు. స్వామివారి దర్శనానంతరం తిరిగి వచ్చే భక్తులకు కూడా ట్రాక్టర్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



### భక్తులకు ముఖ్య గమనిక

కొందరు సామాజిక మాధ్యమాలలో వాహనాల రాకపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు. భక్తులు అటువంటి అపోహలను నమ్మవద్దనీ ఆలయ కమిటీ సూచించింది. అన్ని వాహనాలకు అనుమతి ఉన్నట్లు వారు తెలిపారు.

**అటవీ అధికారుల నియమ నిబంధనలు పాటించాలి**

అటవీ ప్రాంతం దృష్ట్యా ప్రకృతిని కాపాడటం మన బాధ్యతనీ ఇందు కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ప్లాస్టిక్ బాటిళ్లు, అగ్గిపెట్టెలు, సిగరెట్లు వంటి నిషేధిత వస్తువులను అడవిలోకి తీసుకురావద్దని ఆలయ కమిటీ భక్తులకు విన్నవించింది.

## 16వ శాస్త్రీయ సలహా సంఘం సమావేశం

# కెవికె బనవాసిలో విజయవంతం







**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి, 13,(రిపబ్లిక్ న్యూస్):**

మండలం బనవాసిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన 16వ శాస్త్రీయ సలహా సంఘం సమావేశం శాస్త్రీయ చర్చలు, సాంకేతిక సూచనలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనతో సార్థకంగా ముగిసింది. ఈ సమావేశం వ్యవసాయ రంగంలో జరుగుతున్న మార్పులను సమీక్షిస్తూ, రైతుల ఆదాయ పెంపు లక్ష్యంగా సమగ్ర కార్యాచరణను రూపొందించేందుకు వేదికగా నిలిచింది.

సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఎం. జాన్సన్ గారు ప్రస్తుత పరిస్థితుల్లో అధిక సాంద్రత పత్తి సాగు పద్ధతి రైతులకు అధిక దిగుబడి మరియు మెరుగైన ఆదాయం అందించగలదని పేర్కొన్నారు. మట్టి పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం చేయడం ద్వారా ఖర్చులు తగ్గి, నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచించారు. అదనంగా నంద్యాల పప్పుశనగ1267 రకాన్ని విస్తృతంగా ప్రాచుర్యం చేయడం ద్వారా జిల్లాలో పప్పుదినుసుల ఉత్పత్తిని పెంచవచ్చని తెలిపారు.

శ్రీమతి పి.ఎల్. వరలక్ష్మి గారు రైతులు రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా (ఎఫ్‌పీఓలు) ఏర్పడితే సమూహంగా మార్కెటింగ్ చేయడం, ప్రభుత్వ రుణ సౌకర్యాలు పొందడం, విలువ జోడింపు కార్యకలాపాలు చేపట్టడం సులభమవుతుందని వివరించారు. వ్యవసాయ ఉత్పత్తులకు బ్రాండింగ్, నిల్వ సదుపాయాలు, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా రైతుల లాభదాయకత పెరుగుతుందని సూచించారు.

డాక్టర్ కే. రాఘవేంద్ర చౌదరి గారు గత సంవత్సరంలో నిర్వహించిన విస్తరణ కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలు, ప్రదర్శన పొలాలు, రైతు మేళాలు తదితర కార్యక్రమాల ప్రగతిని వివరించారు. రాబోయే సంవత్సరానికి పంటల వైవిధ్యీకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ మిల్లెట్స్ ప్రోత్సాహం, తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడి ఇచ్చే పంటలు, వాతావరణ అనుకూల వ్యవసాయ సాంకేతికతలను రైతులకు చేరవేయాలని కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు.

# 12 వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయండి..

**- 30 శాతం మధ్యంతర భృతి (ఐ.ఆర్) అమలు చేపట్టండి.. - కలెక్టరేట్ వద్ద ఎస్ టి యు ఆధ్వర్యంలో ఎత్తున ఉద్యోగులు ధర్నా..**

**ఏపీ బ్యూరో, ఫిబ్రవరి 13 - (రిపబ్లిక్ న్యూస్) -**

మదనపల్లి :- రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్ టి యు ఏపీ) రాష్ట్ర సంఘం పిలుపు మేరకు దశల వారి పోరాటంలో భాగంగా శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి లోని కలెక్టరేట్ వద్ద ఎస్ టియు జిల్లా అధ్యక్షులు అంకం శివారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ ఆధ్వర్యంలో జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ఉపాధ్యాయులు మండుటెండని సైతం లెక్కచేయకుండా తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ హోరున నినాదాలతో మారుమోగించారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఏకమై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి తమ డిమాండ్లను వివరిస్తూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అంకం శివారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి దాదాపు 19 నెలలవుతున్నా ఇచ్చిన హామీలను ఇంతవరకు అమలు చేయలేదని ముఖ్యంగా 11 వ పిఆర్ సి కాలం ముగిసి 30 నెలలు గడిచాయని, ఐనా 12 పీఆర్సీ కమీషన్ ఇప్పటికీ ఏర్పాటు చేయకపోవడం సరికాదని, తక్షణమే వీటిపై తక్షణమే ఏర్పాటు



చేయాలని, ప్రస్తుత పరిస్థితుల్లో 30 శాతం తగ్గకుండా మధ్యంతర బృత్తి కావాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి మధుసూదన్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఈ ప్రభుత్వం చల్లాల్సిన 34 వేల కోట్ల ఆర్థిక బకాయిలు తక్షణమే చెల్లించాలని, పెండింగ్లో ఉన్న నాలుగు డి.ఏ లు మంజూరు చేయాలని, అలాగే 2004 ముందు నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగం చేరిన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, పోలీసులు, ఇతర ఉద్యోగులకు, కేంద్రం ఇచ్చిన మెమో నెంబర్ 57 ప్రకారం పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు తక్షణమే రావలసిన బెనిఫిట్స్ అన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ రూల్స్ ముసాయిదాలో పెట్టిన 33 సంవత్సరాల సర్వీస్ నిబంధన ప్రకారం ముందస్తు రిటైర్మెంట్ అధికారం ప్రభుత్వానికి ఇవ్వడం సరికాదని, ఇది పూర్తిగా తొలగించాలని, సర్వీస్ లో ఉన్న టీచర్స్ కు టెట్ ఎగ్జామ్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ లను పరిష్కారం చూపాలని లేని పక్షంలో ఫిబ్రవరి 25న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1:00 వరకు నిర్వహిస్తామని సుమారుగా 50 మంది ఉపాధ్యాయులు పాల్గొంటారని ప్రత్యేకించి రాష్ట్ర కౌన్సిలర్ గోవింద రావు, ఆర్థిక కార్యదర్శి శ్రీనివాస్ దొర తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎస్ టియు రాష్ట్ర కౌన్సిలర్ అమర్ నాథ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్లు, మండల లీడర్లు, శ్రీరాములు, ప్రభాకర్ రెడ్డి, రామాంజులు, నౌషాద్, కల్పన, శిరీష, భాస్కర్ రెడ్డి, రహంతుల్లా, నాగరాజ్, రెడ్డప్ప, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, మహిళా ఉపాధ్యాయులు, పాల్గొన్నారు..

# ఉచిత క్యూలైన్ ద్వారా శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్ల దర్శనం చేసిన జిల్లా కలెక్టర్

### సుమారు 20 నిమిషాల్లో మల్లన్న దర్శనం పూర్తి చేసుకున్నజిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





**నంద్యాల, బ్యూరోఫిబ్రవరి 13 (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన శ్రీశైలం దేవస్థానంలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్లను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఉచిత క్యూలైన్ ద్వారా సాధారణ భక్తులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్యూలైన్లలో భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. ఉచిత దర్శన క్యూలైన్ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, శానిటేషన్ సదుపాయాలు, వైద్య సేవలు తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లలో తాగునీటి సదుపాయం నిరంతరంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారికి కలుగుతున్న ఇబ్బందుల గురించి తెలుసుకొని, అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు.ప్రత్యేక దర్శనాల కంటే సాధారణ భక్తులకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన సమర్థవంతమైన ఏర్పాట్ల ఫలితంగా సుమారు 20 నిమిషాల్లోనే శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్ల దర్శనం పూర్తి చేయగలిగామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉచిత క్యూలైన్ ద్వారా భక్తులకు తక్షణ దర్శనం కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. మహాశివరాత్రి వేళల్లో భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో, భక్తులు సంయమనం పాటిస్తూ, శివనామ స్మరణతో, దేవాలయ నియమ నిబంధనలు అనుసరిస్తూ దర్శనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ఉచిత క్యూలైన్ ద్వారా వచ్చే భక్తులకు సమగ్ర సదుపాయాలు

### భక్తులతో కలిసి క్యూలైన్‌లో నిలబడి, సహపంక్తిగా భోజనం చేసిన జిల్లా కలెక్టర్

**నంద్యాల, బ్యూరోఫిబ్రవరి 13 (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
శ్రీశైలం క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉచిత క్యూలైన్ ద్వారా వచ్చే భక్తులకు అన్ని విధాలా సమగ్ర సదుపాయాలు కల్పించినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. భక్తుల సౌకర్యం, భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ ఏర్పాట్లు పటిష్టంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం సాధారణ భక్తులతో కలిసి ఉచిత క్యూలైన్‌లో ప్రయాణించిన జిల్లా కలెక్టర్, శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం లో స్వామి, అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. క్యూలైన్‌లో భక్తులతో మమేకమై వారి అభిప్రాయాలు, సూచనలు స్వయంగా తెలుసుకున్నారు. దర్శన సమయం, క్యూలైన్ నిర్వహణ, తాగునీరు, వైద్య సదుపాయాలు, విశ్రాంతి ఏర్పాట్లపై భక్తులను అడిగి వివరాలుసేకరించారు. దర్శనానంతరం స్వామివారి ఉచిత లడ్డు ప్రసాదాన్ని భక్తులకు స్వయంగా పంపిణీ చేశారు. లడ్డు కౌంటర్ల వద్ద టోకెన్ విధానం, క్రమబద్ధమైన సరఫరా ప్రక్రియ, నిల్వలు, భక్తుల రద్దీ నియంత్రణ తదితర అంశాలను పరిశీలించారు. ప్రసాద పంపిణీ వేగవంతంగా, పారదర్శకంగా జరుగుతున్నదీ నిర్ధారించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అదనపు సిబ్బంది నియామకం, మార్గదర్శక బోర్డులు వంటి ఏర్పాట్లను మరింత బలోపేతం చేయాలనిఅధికారులకుసూచించారు. అదేవిధంగా, క్యూలైన్ ద్వారా భక్తులతో కలిసి దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన సత్రానికి వెళ్లిన కలెక్టర్, సహపంక్తిగా కూర్చొని భోజనం చేశారు. భోజన నాణ్యత, వంటశాల పరిశుభ్రత, తాగునీటి సరఫరా, వడ్డింపు విధానం, కూర్చునే ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. భక్తులకు గౌరవప్రదంగా, వేగవంతంగా భోజనం అందేలా



పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు.బ్రహ్మోత్సవాల దృష్ట్యా రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా పరిశుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సదుపాయాలు, తాగునీటి సరఫరా, భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. భక్తుల సూచనలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన మార్పులు చేయాలని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టామని, ప్రతి విభాగం నిరంతరం పర్యవేక్షణలో ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు.





# మహా శివరాత్రి ఉత్సవాలకు శైవక్షేత్రాల ముస్తాబు

## విద్యుత్ కాంతులతో ఓంకారం, శివనంది ఆలయాలు



విద్యుత్ కాంతులతో విరాజిల్లుతున్న శివనంది





ప్రత్యేక విద్యుత్ కాంతులతో ఓంకారం క్షేత్రం

**బండి ఆత్మకూరు ,ఫిబ్రవరి 13,( రిపబ్లిక్ న్యూస్):-**
నల్లమల అటవీ ప్రాంతంలోని ఓంకార క్షేత్రం, ప్రసిద్ధిగాంచిన నవనందుల ఆలయాల్లో ప్రధానమైన శివ నంది ఆలయాలు మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని పెళ్లి పీటలెక్కనున్న పార్వతీ, పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవ ఘటాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా బండి ఆత్మకూరు మండలంలోని అతి పురాతన శైవ క్షేత్రాలు అయినటువంటి ఓంకారం, శివనంది ఆలయాలు మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వం సన్నద్ధమయ్యాయి. ఆలయా ఈవో నాగప్రసాద్ ఇటు ఓంకారం, అటు శివ నంది ఆలయాలకు ప్రత్యేక విద్యుత్తు దీపాలంకరణ చేయడంతో రాత్రి వేళల్లో విద్యుత్తు కాంతుల వెలుగులతో ఆ ఆలయాలు విరాజిల్లుతున్నాయి. ఇప్పటికే మహాశివరాత్రి ఉత్సవాలను సందర్భంగా ఆయా ఆలయాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్ని రకాల వసతి సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు. శ్రీవారి కళ్యాణ మహోత్సవ ఘట్టాన్ని భక్తులు కనులారా తిలకించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. ఈ మహోన్నత ఘట్టాన్ని భక్తులు కనులారా తిలకించి స్వామివారికృపకుపాత్రులు కాగలరని ఆయన ఆకాంక్షించారు. నేటి నుంచి ఓంకారం,శివ నంది ఆలయాలతో పాటు శ్రీ విష్ణు నందీశ్వర క్షేత్రం( క్రిష్ణనంది) క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి.

# శ్రీశైలంలో పాగాలంకరణ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ





**నంద్యాల జిల్లా, బ్యూరోఫిబ్రవరి 13 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):**
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో శివరాత్రి రోజు నిర్వహించబడనున్న పాగాలంకరణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ కూడా ఈ పరిశీలనలో పాల్గొన్నారు.పాగా అలంకరణ దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూ లైన్లను, భక్తుల రాకపోకల మార్గాలను, భద్రతా చర్యలను కలెక్టర్ ఎస్పీ సమగ్రంగా తనిఖీ చేశారు. దర్శనార్థం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సక్రమమైన మార్గదర్శకాలు, తాగునీటి సౌకర్యం, వైద్య సహాయం వంటి మౌలిక సదుపాయాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రత్యేకంగా పాగాలంకరణ సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు, భద్రతా బందోబస్తు తదితర అంశాలపై పోలీసు శాఖతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. భక్తుల ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని అదనపు సిబ్బందిని నియమించి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.అదేవిధంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. భక్తులు సంయమనం పాటిస్తూ అధికారుల సూచనలు అనుసరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, రెవెన్యూ, పోలీసు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 26వ సారి చల్లా మధు రక్తదానం



**నంద్యాల, ఫిబ్రవరి 13, (రిపబ్లిక్ న్యూస్):** ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలన్న సత్ సంకల్పంతో శుక్రవారంతో 26వ సారీ రక్తదానం చేసి సాయం అందించారు. ఏపీయూడబ్ల్యూజే, జిల్లా ఉపాధ్యక్షుడు, జే ఎస్ ఏ ఏ పి నంద్యాల అధ్యక్షులు సప్త టీవీ రిపోర్టర్ నంద్యాల పట్టణంలోని లైఫ్ హాస్పటల్ నందు గర్భిణీ స్త్రీ కి మరోసారి రక్తదానం చేసి తన సేవాతత్పరతను చాటుకున్నాడు. యువతకు సూర్తిగా నిలుస్తున్న చల్లా మధుకు అభినందనలు తెలియజేస్తున్నారు పలువురు సామాజిక కార్యకర్తలు

# శ్రీశైలంలో పాగాలంకరణ ఏర్పాట్లను

## పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ



**నంద్యాల క్రైం, ఫిబ్రవరి 13, (రిపబ్లిక్ న్యూస్):** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో శివరాత్రి రోజు నిర్వహించబడనున్న పాగాలంకరణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. పాగా అలంకరణ దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూ లైన్లను, భక్తుల రాకపోకల మార్గాలను, భద్రతా చర్యలను కలెక్టర్, ఎస్పీ సమగ్రంగా తనిఖీ చేశారు. దర్శనార్థం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సక్రమమైన మార్గదర్శకాలు, తాగునీటి సౌకర్యం, వైద్య సహాయం వంటి మౌలిక సదుపాయాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రత్యేకంగా పాగాలంకరణ సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు, భద్రతా బందోబస్తు తదితర అంశాలపై పోలీసు శాఖతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. భక్తుల ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని అదనపు సిబ్బందిని నియమించి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. భక్తులు సంయమనం పాటిస్తూ అధికారుల సూచనలు అనుసరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, రెవెన్యూ, పోలీసు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com